# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

22.04.2026
బుధవారం Wednesday

సంపుటి (volume): 1
సంచిక (Issue): 268

పేజీలు : 13
Pages : 13

వెల రూ. 2.00

Published from : Hyderabad
Circulated to : Telangana







## న్యాయ పోరాటానికే ఢిల్లీ వెళ్లా!

**అక్రమ కేసులను ఎదుర్కోవడానికే న్యాయవాదులతో చర్చ**

**ఓటుకు నోటు కేసు విచారణపై హరీష్ రావు కీలక వ్యాఖ్యలు**

**రేవంత్ రెడ్డి భాష, తీరుపై మండిపాటు**



3

కేసీఆర్ సూచన మేరకే తాను ఢిల్లీ వెళ్లి న్యాయవాదులను కలిసినట్లు మాజీ మంత్రి హరీష్ రావు వెల్లడించారు. ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను ఎదుర్కోవడానికే ఈ పర్యటన అని స్పష్టం చేశారు. కాళేశ్వరం కేసులతో పాటు రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానున్న ఓటుకు నోటు కేసు గురించి కూడా న్యాయ నిపుణులతో చర్చించినట్లు తెలిపారు.

## రీల్స్ మోజులో..

**మేడ పైనుంచి పడి 14 ఏళ్ల బాలుడి మృతి**

**మల్లాపూర్‌లో విషాదం**



2

## త్రిస్సూర్‌పూరం వేళ పెను విషాదం



**'బాణసంచా' పేలుడులో 13 మంది దుర్మరణం!**

- నిమిషాల వ్యవధిలోనే వల్లకాడైన తయారీ కేంద్రం..
- చెల్లాచెదురైన శరీర భాగాలు
- 33 మందికి తీవ్ర గాయాలు..
- పలువురి పరిస్థితి విషమం..
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

4



# చర్చలు విఫలం!

## ఆర్టీసీ సమ్మె యథాతథం

- అర్ధరాత్రి నుంచే నిలిచిపోయిన బస్సులు
- నాలుగు వారాల గడువు కోరిన అధికారులు..
- ససేమిరా అన్న కార్మిక సంఘాలు
- రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థపై ప్రభావం..

ఆర్టీసీ కార్మికుల సమ్మె అనివార్యమైంది. తమ డిమాండ్ల సాధన కోసం టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు ఇచ్చిన సమ్మె పిలుపునకు ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి. మంగళవారం సాయంత్రం ఐఏఎస్ అధికారుల కమిటీతో జరిపిన చర్చలు విఫలం కావడంతో, ముందస్తు నిర్ణయం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెలోకి వెళ్తున్నట్లు జేఏసీ నాయకులు అధికారికంగా ప్రకటించారు.



4



2

## 27న బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు!

**తెలంగాణ భవన్‌లో రజతోత్సవ ముగింపు సభ**

**హాజరుకానున్న పార్టీ అధినేత కేసీఆర్**



### కాళేశ్వరం కమిషన్‌పై నేడు తీర్పు

హైకోర్టు 'ఫైనల్ వర్డిక్ట్'

జస్టిస్ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ..

కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై నేడే తీర్పు

.. వివరాలు 2లో

# రెవెన్యూ వ్యవస్థలో నవ శకం



## సర్వే మ్యాప్‌తోనే ఇక భూ రిజిస్ట్రేషన్లు!

**కూసుమంచిలో చారిత్రాత్మక ఘట్టం..**

**తొలి డాక్యుమెంట్‌ను నమోదు చేసిన మంత్రి పొంగులేటి**



- ప్రతి భూమికి ప్రత్యేక 'భూధార్' నంబర్..
- ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం
- భూ హక్కులకు శాశ్వత భరోసా కల్పిస్తాం



దశాబ్దాలుగా నలుగుతున్న భూ తగాదాలు.. సరిహద్దు గట్ల పంచాయితీలు.. కోర్టుల చుట్టూ తిరిగే రైతన్నల కష్టాలు.. వీటన్నింటికీ ముగింపు పలికే ఆ 'బ్రహ్మాస్త్రం' రాష్ట్రంలో అడుగుపెట్టింది. నిన్నటి వరకు కేవలం కాగితాలకే పరిమితమైన భూ హక్కులకు ఇకపై ఒక డిజిటల్ భద్రత, ఒక స్పష్టమైన మ్యాప్ తోడుకానున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి వేదికగా తెలంగాణ రెవెన్యూ చరిత్రలో ఒక మలుపు తిప్పే ఘట్టానికి మంగళవారం నాంది పలికారు.

**ఖమ్మం, ఏప్రిల్ 21:** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో మంగళవారం సర్వే మ్యాప్‌తో కూడిన తొలి భూ రిజిస్ట్రేషన్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా

మిగతా 2 లో



2

## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

- హెల్త్‌టెక్, ఏఐ రంగాల్లో పెట్టుబడుల వరద..
- త్వరలో 'వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు!
- నార్వే బృందందతో మంత్రి శ్రీధర్ బాబు

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కండి


కాంగ్రెస్ కార్యకర్తలకు దామోదర సూచన



2

# ఇరాన్‌తో చర్చలకు సిద్ధం

4



- 'శాంతి' దిశగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు!
- అభ్యంతరం లేదన్న అగ్రరాజ్య అధినేత..
- బెదిరింపులకు లొంగం: ఇరాన్

# 'పడకగది' దుమారం

బిహార్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్ అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రాజకీయ వర్గాల్లో అగ్గి రాజేశారు. మహిళల రాజకీయ ఎదుగుదలను కించపరిచే విధంగా ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. 90 శాతం మంది మహిళల రాజకీయ జీవితం నాయకుల 'పడకగది' (బెడ్‌రూమ్) నుంచే ప్రారంభమవు తుందంటూ ఆయన చేసిన అసభ్యకర వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి.

- రాజకీయాల్లో మహిళలపై జుగుప్సాకర విమర్శలు
- బెడ్‌రూమ్ నుంచే మహిళల రాజకీయ ప్రస్థానమంటూ వ్యాఖ్య..
- భగ్గుమన్న మహిళా లోకం..
- రంగంలోకి మహిళా కమిషన్
- ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలని బీజేపీ డిమాండ్

4





# ఉగ్రవాది అని అనలేదు..

- భయపెడుతున్నారని మాత్రమే చెప్పా!
- మోదీపై వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే వివరణ

4




# కాళేశ్వరం కమిషన్‌పై నేడు తీర్పు

**హైదరాబాద్, ఏప్రిల్ 21:** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ఏర్పాటు చేసిన కమిషన్‌కు సంబంధించిన కేసులో తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు ఇవ్వనుంది. ఈ కమిషన్‌ను సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ ఘోష్ నేతృత్వంలోని కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా, కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు వెలువడే తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో కోర్టు తీసుకునే నిర్ణయం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన తదుపరి పరిణామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# తెలంగాణకు 8 కొత్త రైళ్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 21:** రైల్వే మంత్రిత్వ శాఖ తెలంగాణకు ఎనిమిది కొత్త రైళ్లను ప్రకటించింది. హైదరాబాద్‌లోని కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్ల నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా ఈ కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు కేంద్ర రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నుంచి ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు భువనేశ్వర్, తిరుచానూరు, తిరుపతి, శ్రీ గంగానగర్, జైపూర్ వంటి ముఖ్యమైన నగరాలకు కనెక్టివిటీని పెంచుతాయని, దీంతో ప్రయాణం మరింత సులభతరం అవుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కాగా, ఈ రైళ్లు మే నుంచి జూలై మధ్య దశల వారీగా ప్రారంభం అవుతాయి. రైళ్లన్నీ వారానికి ఒకసారి నడుస్తాయి. కాగా, తెలంగాణకు ఎనిమిది రైళ్లను కేటాయించినందుకు ప్రధాని మోదీకి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

# రీల్స్ మోజులో బిల్డింగ్‌పై నుంచి పడ్డ బాలుడు

**హైదరాబాద్, ఏప్రిల్ 21:** గంటలు తరబడి రీల్స్ స్క్రోల్ చేస్తూ టైం వేస్ట్ చేసేవారు కొందరైతే... రీల్స్ కోసం రిస్క్ చేసి ప్రాణాల మీదకు తెచుకునేవారు మరికొందరు. రీల్స్ కోసం రిస్క్ చేసి మరో బాలుడు ప్రాణాలు వదిలాడు. హైదరాబాద్ లో దారుణం జరిగింది. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ బిల్డింగ్ పై నుంచి జారిపడి బాలుడు మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... హైదరాబాద్ లోని నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ గాంధీ బొమ్మ బస్తీకి చెందిన 14 ఏళ్ళ బాలుడు మితున్ రీల్స్ చేస్తూ బిల్డింగ్ పైనుంచి పడి మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మిథున్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. మితున్ బిల్డింగ్ మీద నుంచి కిందపడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాలుడి మృతదేహాన్ని బీహార్ కు తరలిస్తున్నారు బంధువులు. మితున్ మృతితో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, ఏప్రిల్ 21:** తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 38ను విడుదల చేసింది. ఈ బదిలీల పక్రియ మే 1 నుంచి మే 31 వరకు జరగనుంది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన ఉద్యోగుల బదిలీలకు సర్కార్ అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లకు మించి ఒకేచోట పోస్టింగ్‌లో ఉండరాదని స్పష్టం చేసింది. భార్యాభర్తలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ముందుగా ప్రాధాన్యం ఉండనుంది. మొత్తం ఉద్యోగులలో 40 శాతానికి మించకుండా మాత్రమే బదిలీలు చేపట్టాలని సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

# ఐఏఎస్ రజత్ అవినీతిపై విచారణ

## కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** తెలంగాణ ఐఏఎస్ అధికారి రజత్ కుమార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి ఢిల్లీ హైకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఐఏఎస్ అధికారిపై వచ్చిన ఫిర్యాదును మూడు నెలల్లోగా తేల్చాలని కేంద్రాన్ని ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ల నిధులతో ఐఏఎస్ అధికారి తన కుమార్తె వివాహం నిర్వహించారని, అది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ÷వ్ స్టార్ హోటల్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలకు సంబంధించిన ఖర్చులను కాంట్రాక్టర్లే భరించారని పిటిషనర్ ఆరోపించారు. నాలుగేళ్లుగా కేసు విచారణలో ఎలాంటి పురోగతి లేకపోవడంపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ ఫిర్యాదుపై తార్కిక ముగింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అధికారం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉందన్న ఢిల్లీ హైకోర్టు.. ఈ ఫిర్యాదుపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది.

# ఖర్గేవి దిగజారుడు వ్యాఖ్యలు

## బాధ్యతాయుతమైన వ్యక్తి ఇలాంటి మాటలా

## మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 21:** ప్రధానమంత్రి నరేంద్రమోదీని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఉగ్రవాది అని సంబోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపేర్కొన్నారు. ఓ జాతీయ పార్టీ అధ్యక్షుడిగా, సుదీర్ఘ రాజకీయ అనుభవం గల నాయకుడిగా ఖర్గేకు పేరు ఉందని ప్రస్తావించారు. బాధ్యాతాయుతమైన ప్రధానమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై.. ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని తెలిపారు. ఖర్గే.. మోదీపై పదే పదే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుండటం.. ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని బట్టబయలు చేస్తోందని విమర్శించారు. ఉగ్రవాదాన్ని అణచివేయడంలో అహోరాత్రులు శ్రమిస్తున్న మోదీని ఉగ్రవాదిగా సంబోధించే ముందు.. ఉగ్రవాదులతో కాంగ్రెస్ నాయకులు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన విషయాన్ని మల్లికార్జున్ ఖర్గే గుర్తుపెట్టుకుంటే బాగుండేదని ఎద్దేవా చేశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో.. కశ్మీర్ వేర్పాటువాద ఉగ్రవాది యాసిన్ మాలిక్‌తో చర్చలు జరిపిన విషయం ఖర్గేకు గుర్తులేదా..? అని ప్రశ్నించారు. ప్రధానిని ఉద్దేశించి మాట్లాడుతున్నప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలు మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. రాజకీయాల్లో మరీముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమని.. కానీ ఈ ప్రయత్నంలో వ్యక్తిగత దూషణలకు చోటులేదని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలోనూ కావాల్సినంత విషం కక్కారని ఆగ్రహించారు. ఎన్నికల ప్రచారంలో మహిళలు తమను ద్వేషిస్తున్నారని తెలిసి ఆవేదనతో, ఆక్రోషంతో ప్రధానమంత్రి మీద ఇలాంటి విమర్శలు చేయడం సరికాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# 27న బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు!

## తెలంగాణ భవన్‌లో రజతోత్సవ ముగింపు సభ

## హాజరుకానున్న పార్టీ అధినేత కేసీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవాల ముగింపు కార్యక్రమాలకు సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ హైకమాండ్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, సంస్థాగతంగా పార్టీని బలపరిచే అంశాలపై గులాబీ బాస్ మార్గనిర్దేశర చేయనున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొత్త సమీకరణాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన వ్యూహాన్ని పునర్నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగే ఈ సమావేశం భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలు, ప్రజల్లో తిరిగి బలం పెంపొందించుకోవడం, పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయడంపై దృష్టి సారించనుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ప్రయత్నిస్తోంది. గ్రామస్థాయి నాయకత్వం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయం పెంచడం, యువతను ఆకర్షించడం, పాత సభ్యత్వాలను తిరిగి క్రియాశీలం చేయడం వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానునట్లు సమాచారం. ఈ నెల 27వ తేదీన తెలంగాణ భవన్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ ముగింపు సమావేశం పార్టీ భవిష్యత్తు దిశను నిర్ణయించే కీలక ఘట్టమని కేడర్ భావిస్తోంది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ద్వారా గులాబీ పార్టీ తన రాజకీయ వ్యూహాలను పునరుద్ధరించుకునే అవకాశం ఉంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణంపై గులాబీ కేడర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త కమిటీల ఏర్పాటు, నాయకత్వ బాధ్యతల పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త వ్యూహాలు రూపొందించనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి బీఆర్ఎస్ కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు పాల్గొననున్నారు. ఈ సమావేశం ద్వారా పార్టీ అంతర్గత సమన్వయాన్ని బలోపేతం చేయడమే కాకుండా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కేసీఆర్ సమగ్ర సమీక్ష చేయనున్నారు.

# రెవెన్యూ వ్యవస్థలో సరికొత్త శకం

మొదటి పేజీ తరువాయి

సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన రెవెన్యూ సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. భూముల రికార్డులను పక్కాగా నిర్వహించేందుకు 'భూభారతి' పోర్టల్‌ను తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. "ఈ పోర్టల్ రైతులకు భద్రత, వారి కుటుంబాలకు నమ్మకం కలిగిస్తుంది. ల్యాండ్, సర్వే, మరియు రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకురావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ఇకపై ప్రతి భూమికి ఆధార్ తరహాలోనే ప్రత్యేకమైన 'భూధార్' నంబర్ కేటాయిస్తాం" అని పొంగులేటి వెల్లడించారు. భూయాజమాన్యంపై ఎటువంటి సందేహాలు లేకుండా ఉండేందుకు, రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనను తీసుకువస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కూసుమంచిలో జరిగిన తొలి రిజిస్ట్రేషన్ ఈ కొత్త విధానానికి నాంది పలికిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీనిని అమలు చేస్తున్నామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితమైన భూసర్వేలు నిర్వహించి, దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని స్పష్టం చేశారు. గతంలో సర్వే నంబర్ల విషయంలో ఉన్న గందరగోళం, సరిహద్దు వివాదాలకు ఈ సర్వే మ్యాప్ విధానం చెక్ పెడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతు భూమి హక్కులకు పూర్తి స్పష్టతనివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, పారదర్శకమైన పాలనతో ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.






# చర్చలు విఫలం!

## ఆర్టీసీ సమ్మె యథాతథం

## అర్ధరాత్రి నుంచే నిలిచిపోనున్న బస్సులు

## నాలుగు వారాల గడువు కోరిన అధికారులు..

## ససేమిరా అన్న కార్మిక సంఘాలు

## రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థపై ప్రభావం..

**హైదరాబాద్, ఏప్రిల్21:** తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె అనివార్యమైంది. తమ డిమాండ్ల సాధన కోసం టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు ఇచ్చిన సమ్మె పిలుపునకు ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి. మంగళవారం సాయంత్రం ఐఏఎస్ అధికారుల కమిటీతో జరిపిన చర్చలు విఫలం కావడంతో, ముందస్తు నిర్ణయం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెలోకి వెళ్తున్నట్లు జేఏసీ నాయకులు అధికారికంగా ప్రకటించారు. చర్చల సందర్భంగా ఐఏఎస్ అధికారుల కమిటీ సమస్యల పరిష్కారానికి నాలుగు వారాల సమయం కోరింది. అయితే దీనిని జేఏసీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. "మార్చి 13నే సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. తీరా సమ్మెకు ఒక్కరోజు ముందు చర్చలకు పిలిచి గడువు కోరడం సమంజసం కాదు. ఇప్పటికే ఎన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి, ఇకపై తాత్సారం చేసే ఓపిక కార్మికులకు లేదు" అని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. అధికారుల నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ లభించకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్మికులు ఐక్యంగా పోరాడాలని జేఏసీ పిలుపునిచ్చింది. "ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దు.. అన్ని డిపోల్లో సమ్మెను విజయవంతం చేయాలి" అని కార్మికులను ఉద్దేశించి నాయకులు పేర్కొన్నారు. సమ్మె కారణంగా బుధవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సు సర్వీసులు నిలిచిపోయే అవకాశం ఉంది. దీంతో సాధారణ ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ రవాణా ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, ఆర్టీసీ సేవలు ఆగిపోవడం రవాణా వ్యవస్థపై పెద్ద దెబ్బేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు.



# తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

## నార్వే బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ–నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, క్లైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ–నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కండి

## కాంగ్రెస్ కార్యకర్తలకు దామోదర సూచన



**సంగారెడ్డి, ఏప్రిల్ 21:** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పార్టీ నేతలకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశానికి మంత్రి దామోదర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాయకుల్లో వర్గపోరు ఉంటే పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పదవిని అనుభవించాలని మంత్రి అన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన ఉన్నా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బలమని.. కార్యకర్తలే ధైర్యం, స్థైర్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో సిద్ధాంతాలు, విశ్వాసం తక్కువని... అవకాశవాదం ఎక్కువన్నారు. ఎప్పుడూ శత్రువుని తక్కువ అంచనా వేయకూడదని సూచించారు. 70 వేల ఉద్యోగాలను ప్రభుత్వం ఇప్పటికే భర్తీ చేసిందని వెల్లడించారు. ఆరోగ్య శాఖలో ఇంకో 3 నెలల్లో మొత్తం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం పథకం దేశంలో ఎక్కడా లేదని దామోదర రాజనర్సింహ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని అన్నారు. 200 కోట్ల రూపాయల అభివృద్ధి పనులతో సింగూరు ప్రాజెక్ట్‌ను టూరిజం స్పాట్‌గా మారుస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రైవేట్ పరం చేసే యత్నాలను అడ్డుకుంటాం
- ప్రజలు సమస్యల్లో ఉంటే సభలతో కాలయాపనా
- 25న రాజకీయ శక్తిగా ముందుకు రాబోతున్నాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్ 21 :**ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్టిసి కార్మికులంటే లెక్కలేనితనంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. ఆర్టిసిలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్టిసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమ్మెకు దిగిన ఆర్టిజన్లను బెదిరించి విధుల్లో చేరేలా ఒత్తిడి చేశారని అన్నారు. ప్రజలందరూ సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదని అన్నారు. ఆర్టిసిని ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరించారు. వెంటనే ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం, ప్రతిపక్షం సభలు పెట్టాయంటూ మండిపడ్డారు. ప్రతిపక్షం ఉట్టికథలు చెబితే.. ప్రభుత్వం పిట్టకథలు చెప్పిందంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభలో బీజేపీపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. వెయ్యి ఏళ్లైనా బీఆర్ఎస్ మారదని కవిత వ్యాఖ్యానించారు. గుంటనక్క నిన్న ఢిల్లీ వెళ్లి ఆర్ఎస్ఎస్ పెద్దలను కలిసిందన్నారు. ప్రాజెక్ట్‌ల్లో అవినీతి నుంచి బయటపడేందుకు ఆర్ఎస్ఎస్‌తో చర్చలు జరిపారంటూ కవిత ఆరోపించారు. ఈనెల 25న తెలంగాణ రాజకీయాల్లోకి నూతన రాజకీయ శక్తిగా వస్తున్నామని, ప్రజలందరికీ ఈ వేదిక నుంచి ఆహ్వానం పలుకుతు న్నామని చెప్పారు. పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ కార్యకర్తలు మంగళవారం పాదయాత్రగా బయలుదేరారని తెలిపారు. తమ పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే క్యాడర్ వాహనాలకు ఎలాంటి ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని పోలీసులు, అధికార యంత్రాంగాన్ని కోరారు.

# న్యాయ పోరాటానికే ఢిల్లీ వెళ్లాను!

- అక్రమ కేసులను ఎదుర్కోవడానికే న్యాయవాదులతో చర్చ
- ఓటుకు నోటు కేసు విచారణపై హరీష్ రావు కీలక వ్యాఖ్యలు
- రేవంత్ రెడ్డి భాష, తీరుపై మండిపాటు



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచన మేరకే తాను ఢిల్లీ వెళ్లి న్యాయవాదులను కలిసినట్లు మాజీ మంత్రి హరీష్ రావు వెల్లడించారు. ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను ఎదుర్కోవడానికే ఈ పర్యటన అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కాళేశ్వరం కేసులతో పాటు రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానున్న ఓటుకు నోటు కేసు గురించి కూడా న్యాయ నిపుణులతో చర్చించినట్లు తెలిపారు. ఓటుకు నోటు కేసులో అప్పటి హోంమంత్రి కూడా భాగస్వామిగా ఉన్నారని హరీష్ గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోం శాఖ తరఫున పేరు లేని న్యాయవాదిని పెట్టారని విమర్శించారు. నిందితుల తరఫున మాత్రం ప్రఖ్యాత న్యాయవాది ముకుల్ రోహత్గీని నియమించుకున్నారని ఆరోపించారు. రేపటి విచారణలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి నిందితుడిగా ఉన్నారని.. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టేపై ఉన్నారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్ గాంధీతో.. ఉదయం బీజేపీ నేతలతో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. జగిత్యాల సభ ద్వారా కేసీఆర్ బయటకు వచ్చినందుకే ప్రభుత్వం రెండో విడత రైతు భరోసా విడుదల చేసిందని హరీష్ రావు అన్నారు. పంట పెట్టుబడికి ఇవ్వాల్సిన డబ్బును పంట చేతికి వచ్చాక ఇస్తున్నారని దుయ్యబట్టారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళ్లూ దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ సభకు పోటీగా రేవంత్ రెడ్డి సభ పెట్టడం ఆయన కురచ బుద్ధిని చాటుతోందని విమర్శించారు. సోషల్ మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36 లక్షల మంది లైవ్ లో చూశారని.. రేవంత్ ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని లెక్కలు చెప్పారు. కాంగ్రెస్ అధికారిక సైట్ లో కేవలం 54 మంది మాత్రమే చూశారని ఎద్దేవా చేశారు. "పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు" రేవంత్ రెడ్డి తీరు ఉందని హరీష్ రావు ఎద్దేవా చేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో.. రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ ఎక్కడా రేవంత్ పేరు ఎత్తకుండా హుందాగా మాట్లాడారని.. కానీ రేవంత్ మాత్రం పదేపదే కేసీఆర్ పేరు తలుస్తూ తన భయాన్ని బయటపెట్టుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి హుందాతో మాట్లాడటం నేర్చుకోవాలని.. లేదంటే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లు కూడా రావని హితవు పలికారు. మిగిలిన కాలంలోనైనా ప్రజలకు మంచి పాలన అందించాలని సూచించారు. తన ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదని.. శంషాబాద్ విమానాశ్రయం నుంచే నేరుగా వెళ్లానని హరీష్ రావు స్పష్టం చేశారు.

## ఎందరో ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం

**ఏ ఒక్కరి వల్లనో రాలేదు: కడియం**



**జనగామ, ఏప్రిల్ 21:**సకల జనుల పోరాటం, ఎందరో ఆత్మబలిదానాల వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఏ ఒక్కరి వల్లనో తెలంగాణ ఏర్పడలేదన్నారు. అయితే దీనిని తానే తెచ్చానని కెసిఆర్ చెప్పుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చిన తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం పాలైందని విమర్శించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం మాత్రమే వేల కోట్ల ఆస్తులను కూడబెట్టుకుందని ఆరోపించారు. ఇప్పుడు వాళ్లే నీతులు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. 'నేను ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. నిజాయితీగా, నిక్కచ్చిగా ఉన్నాను కాబట్టి రాజకీయాలలో నిలబడగలిగాను' అని ఎమ్మెల్యే వెల్లడించారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉన్నానని.. అందుకే 35 ఏళ్లుగా రాజకీయాలలో కొనసాగుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గతంలో తప్పుడు పనులు చేసి తలవంపులు తీసుకువచ్చిన వారు చాలా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నియోజకవర్గ ప్రజలు గర్వపడే విధంగానే నా పని తీరు ఉంటుంది' అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు.

## అప్పుడు కేసీఆర్‌కు.. ఇప్పుడు రేవంత్‌కు

**ఏటీఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్**

**రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ బండి విమర్శలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన స్కామ్ రూ.లక్ష కోట్లా? రూ.9వేల కోట్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై అయినా ప్రభుత్వం చర్యలు తీసుకుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్, రేవంత్ భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కేంద్రానికి రేవంత్‌రెడ్డి రాసిన లేఖలో ఏముందని అడిగారు. రూ. 9వేల కోట్ల అవినీతిపై దర్యాప్తు జరపాలని సీఎం రేవంత్ అంటున్నారని.. మరి లక్ష కోట్ల స్కామ్ గురించి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. రేవంత్ రాసిన లేఖలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ పంచుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళలు ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీకి పదవులు ఇస్తే మొత్తం మహిళలకు పదవులు వచ్చినట్టు భావిస్తున్నారన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు పదవులు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగితే.. సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్లేస్‌లో కూర్చోవాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు వీగిపోవడానికి స్టాలిన్, రేవంత్ రెడ్డినే కారణమని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ కలవవని.. కలిసి పోటీ చేయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్లు

**రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు వెల్లడి**



**హైదరాబాద్, ఏప్రిల్ 21:**తెలంగాణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారీగా నిధులు ఇచ్చిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన మేరకు చేయూతను ఇస్తోందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.12 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. అలాగే గత రెండేళ్లలో రూ. లక్ష యాభై వేల కోట్లు రాష్ట్రానికి ఇచ్చిందని ఆయన వివరించారు. దీనిపై తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు. అందుకు మీరు సిద్ధమా అంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సవాల్ విసిరారు. ఈ అంశంపై మీరు ఇద్దరు ఎక్కడికి వచ్చినా తాను చర్చకు సిద్ధమన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించి చెబితే తాను సైతం చర్చకు సిద్ధమని కుండబద్దలు కొడతానన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తమ వద్ద రాయబారాలు నడపడం లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి.. ఆ పార్టీ నేతల వద్ద మోకరిల్లుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం సీబీఐకి ఇవ్వమంటే.. నాణ్యత లేని బ్యారేజీలను మాత్రమే సీబీఐకి అప్పగించారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. దీనిని కాళేశ్వరం మొత్తం మీద సీబీఐ విచారణ అంటే ఎలా? అంటూ ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు కాదు.. గత పదేళ్లలో టీఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లు సమావేశాలు పెట్టినట్లుగా ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు.



# పదేళ్లు అబద్ధాల పాలన

**బీఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ**

**రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష**

**నల్గొండ, ఏప్రిల్ 21:** అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అబద్ధాలు చెప్పి మోసం చేయడం కేసీఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్ఛిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. వే-ంమేప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

## అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట

**మోటర్లకు మీటర్లపై మండిపడ్డ ఎంపీ అర్వింద్**



**హైదరాబాద్, ఏప్రిల్ 21:**వ్యవసాయ మోటర్లకు కరెంట్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినవన్నీ కేంద్రం నిధులతో చేసినవేనని చెప్పారు. కేసీఆర్.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపులు చేయలేదు. భూముల ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. 72 ఏళ్ల వయసులోనూ కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన హయాంలోనే సివిల్ సప్లయ్‌లో అక్రమాలు ప్రారంభమయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆనాటి నుంచి కేసీఆర్ కోవర్టు. ఆయన పేరుకే కాంగ్రెస్.. నిజానికి బీఆర్ఎస్ కార్యకర్త అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సివిల్ సప్లయ్‌లో అక్రమాలను ఉత్తమ్ కొనసాగిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లులో కరెంట్ మీటర్ అనేది లేనేలేదు. రైతుల వద్ద కరెంట్ బిల్లు వసూలు చేయాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదు. ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలు ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలు అడిగిన మహిళలపై దౌర్జన్యాలు చేయించారు. తెలంగాణలో రైతులను ఆదుకోలేదు కానీ, పంజాబ్‌కు వెళ్లి చెక్కులు ఇచ్చి వచ్చారని అర్వింద్ విమర్శించారు.

## పాలమూరు-రంగారెడ్డిపై అవాస్తవాల ప్రకటన

**95శాతం ప్రాజెక్టు పూర్తయినట్లు రుజువు చేస్తే రాజీనామా: మంత్రి**



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి బీఆర్ఎస్ నేతలకు మంత్రి వాకిటి శ్రీహరి సవాల్ విసిరారు. మంగళవారం మంత్రి మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 95 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని అన్నారు. నిరూపిస్తే ఇక్కడి నుంచి వెళ్లి ఇప్పుడే రాజీనామాకు సిద్ధమని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాదు రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇంకా భ్రమల్లో ఉన్నారని.. ఆయన మాటలకు విశ్వసనీయత లేదని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం ఉందని మంత్రి తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.



## సంపాదకీయం

## ఎండలు మండుతున్నాయి..

# బాధ్యత ఎక్కడ?

తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ అసమతుల్యత కారణంగా ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశమున్నట్లు వాతావరణశాఖ ముందుగానే హెచ్చరించింది. అయినప్పటికీ, ప్రతి ఏడాది మాదిరిగానే ఈ హెచ్చరికలు మాటలకే పరిమితమవుతున్నాయి. పాలకుల్లో ముందుచూపు లోపం, సమగ్ర ప్రణాళికల కొరత వల్ల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతోంది. ప్రకృతి వనరుల వినియోగంలో నియంత్రణ లేకపోవడం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. నదుల్లో ఇసుక దోపిడీ, కొండల తవ్వకాలు, అడవుల నరికివేత.. ఇవి అన్నీ కలిపి పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. చెట్ల కొరతతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీడ కూడా అరుదైపోయింది. ఉష్ణోగ్రతలు పెరగడం, భూగర్భ జలాల తగ్గుదల, గాలి కాలుష్యం పెరుగుదల.. అన్ని కలిపి ప్రజల ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. వ్యవసాయ రంగం ఈ ప్రతికూల పరిణామాలకు మొదటగా బలి అవుతోంది. వర్షాభావం, ఎరువుల కొరత, సాగునీటి సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు ఆశలతో పాటు ఆందోళనలను కూడా తెస్తోంది. విత్తనాలు, ఎరువులు, రుణాల వంటి ప్రాథమిక అవసరాలు సకాలంలో అందకపోవడం వల్ల రైతులు ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. గిట్టుబాటు ధరలు లేకపోవడం, పెట్టుబడి వ్యయం పెరగడం రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి. కూలీల కొరత కూడా వ్యవసాయానికి పెద్ద సమస్యగా మారింది. జనాభా పెరుగుతున్నప్పటికీ వ్యవసాయ రంగంలో పనిచేయాలనే ఆసక్తి తగ్గుతోంది. యువత ఇతర రంగాలవైపు మళ్లిపోవడంతో చిన్న, మధ్య తరహా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాంత్రీకరణ పెరుగుతున్నప్పటికీ డీజిల్ ఖర్చులు, యంత్రాల నిర్వహణ వ్యయం రైతులపై అదనపు భారం మోపుతున్నాయి.

**ఇక అంతర్జాతీయ పరిస్థితులు కూడా రైతాంగంపై ప్రభావం చూపుతున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం, చమురు ధరల పెరుగుదల, ఎరువుల ముడిసరుకు కొరత వంటి అంశాలు దేశీయ వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోవడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ప్రపంచ మార్కెట్‌లో మార్పులు దేశీయ వ్యవసాయాన్ని నేరుగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసరంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వాతావరణ హెచ్చరికలను గంభీరంగా పరిగణించి ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి. ప్రాంతాల వారీగా పంటల ఎంపికపై రైతులకు స్పష్టమైన మార్గనిర్దేశనం ఇవ్వాలి. నీటి వినియోగంపై నియంత్రణ, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ వంటి చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలి.**

అలాగే విత్తనాలు, ఎరువులు, రుణాలు సకాలంలో అందేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతులకు తక్కువ వడ్డీ రుణాలు, పంట బీమా, మద్దతు ధరలు వంటి అంశాలను సమ–ర్థవంతంగా అమలు చేయాలి. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే దిశగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవాలి. తాగునీటి సమస్య కూడా రోజురోజుకూ తీవ్రమవుతోంది. పట్టణాలు, గ్రామాల్లో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. నీటి సరఫరా వ్యవస్థలను మెరుగుపరచడం, లీకేజీలను తగ్గించడం, నీటి వృథాను నియంత్రించడం అత్యవసరం. ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన పెంచడం కూడా సమానంగా ముఖ్యమే.

**ప్రకృతి హెచ్చరికలు ప్రతి ఏడాది వస్తూనే ఉంటాయి. కానీ వాటిని గుణపాఠాలుగా తీసుకుని వ్యవస్థను సరిదిద్దడం పాలకుల బాధ్యత. ముందుచూపుతో వ్యవహరిస్తేనే రైతాంగాన్ని కాపాడగలం, భవిష్యత్తు సంక్షోభాలను తగ్గించగలం. లేకపోతే ప్రతి ఏడాది ఇదే సమస్యల పునరావృతం కొనసాగుతూనే ఉంటుంది. ప్రజల సహకారం, ప్రభుత్వ సంకల్పం కలిసివస్తేనే ఈ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది.**



# త్రిస్సూర్‌పూరం వేళ పెను విషాదం



- ‘బాణసంచా’ పేలుడులో 13 మంది దుర్మరణం!
- నిమిషాల వ్యవధిలోనే వల్లకాడైన తయారీ కేంద్రం..
- చెల్లాచెదురైన శరీర భాగాలు
- 33 మందికి తీవ్ర గాయాలు..
- పలువురి పరిస్థితి విషమం..
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

**త్రిస్సూర్/కేరళ:** దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ‘త్రిస్సూర్ పూరం’ ఉత్సవాలకు నగరం ముస్తాబవుతోంది. ఆకాశంలో రంగురంగుల వెలుగులు నింపే బాణసంచా ప్రదర్శన కోసం కార్మికులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. అయితే, ఆ వెలుగులు నింపాల్సిన చోటే అనూహ్యంగా చీకటి అలుముకుంది. అప్పటివరకు ఉత్సాహంగా పనులు చేసుకుంటున్న ఆ ప్రాంగణం.. కేవలం ఒక్కసారిగా విన్పించిన భీకర శబ్దంతో మరుభూమిగా మారిపోయింది. కంటి రెప్పపాటు కాలంలో జరిగిన పెను ప్రమాదం 13 మంది నిండు ప్రాణాలను బలిగొనడమే కాకుండా, పదుల సంఖ్యలో కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. ముండతికొట్టె సమీపంలోని బాణసంచా తయారీ మరియు నిల్వ కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 3:30 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. తొలుత ఒక షెడ్డులో మొదలైన పేలుడు, నిమిషాల వ్యవధిలోనే చుట్టుపక్కల ఉన్న ఇతర నిల్వ కేంద్రాలకు వ్యాపించి వరుస పేలుళ్లకు దారితీసింది. పేలుడు ధాటికి కిలోమీటర్ల మేర శబ్దం విన్పించడంతో, స్థానికులు ఒక్కసారిగా భూకంపం వచ్చిందేమోనని భయాందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. గాలిలో దట్టమైన పొగ అలుముకోవడంతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఘటనా స్థలంలో పేలుడు తీవ్రత ఎంతలా ఉందంటే.. కార్మికుల శరీర భాగాలు చెల్లాచెదురుగా పరిసర ప్రాంతాల్లో పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 13 మంది మరణించినట్లు అధికారిక వర్గాలు ధృవీకరించాయి. మరో 33 మంది తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. అగ్నిమాపక సిబ్బంది మరియు పోలీసులు గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. కేరళలో ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్రమైన వేడి (ఉష్ణతరంగాలు) కారణంగా రసాయనాలు పేలి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, నిల్వ కేంద్రాల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదని, భారీ మొత్తంలో బాణసంచా నిల్వ ఉంచడమే ఇంతటి భారీ ప్రాణనష్టానికి కారణమైందని విమర్శలు వస్తున్నాయి. ఈ ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్‌ను ఆదేశించారు. త్రిస్సూర్ కలెక్టర్ ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు.



# ఇరాన్‌తో చర్చలకు సిద్ధం



- ‘శాంతి’ దిశగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు!
- అభ్యంతరం లేదన్న అగ్రరాజ్య అధినేత..
- బెదిరింపులకు లొంగం: ఇరాన్

**ఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు శాంతి చర్చల ప్రతిపాదన చేశారు. ఇరాన్ నాయకత్వం సంప్రదింపులకు ముందుకు వస్తే, తాను నేరుగా చర్చల్లో పాల్గొనేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేశారు. తాజా ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. “వారు కలవాలనుకుంటే మా దగ్గర సమర్థులైన ప్రతినిధులు ఉన్నారు. ఒకవేళ నన్నే కలవాలనుకున్నా నేను సిద్ధమే. శాంతి చర్చల గురించి మాట్లాడటానికి ఎప్పుడూ ద్వారాలు తెరిచే ఉంటాయి” అని ప్రకటించారు. ఈ చర్చలు ప్రత్యక్షంగా సాధ్యం కాకపోతే వర్చువల్ విధానంలోనైనా జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా–ఇరాన్ మధ్య రెండో దఫా శాంతి చర్చలకు పాకిస్థాన్ వేదిక కానుందనే వార్తలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించబడే అవకాశం ఉందని అమెరికా మాజీ సీఐఏ చీఫ్ డేవిడ్ హెచ్ పెట్రయాస్ కూడా అభిప్రాయపడ్డారు. అయితే, ఈ చర్చలపై ఇరాన్ నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఒకవైపు శాంతి దిశగా అడుగులు పడుతున్నాయన్న ఆశాభావం కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

### బెదిరింపులకు లొంగం: ఇరాన్

ట్రంప్ ప్రతిపాదనపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ అత్యంత ఘాటుగా స్పందించారు. అమెరికా తమపై నిరంతరం బెదిరింపులకు పాల్పడుతోందని, అటువంటి వారితో చర్చలకు అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ముఖ్యంగా ఇరాన్ నౌకల రవాణాపై ట్రంప్ ప్రభుత్వం విధించిన దిగ్బంధనం ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను తీవ్రంగా దెబ్బతీసిందని ఆయన మండిపడ్డారు. అమెరికా వైఖరిలో మార్పు రానంత వరకు చర్చలకు తావులేదని ఇరాన్ స్పష్టం చేయడంతో, ఈ ప్రతిపాదన ఎంతవరకు సఫలీకృతమవుతుందనేది వేచి చూడాలి.

# ఉగ్రవాది అని అనలేదు..

- భయపెడుతున్నారని మాత్రమే చెప్పా!
- మోదీపై వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే వివరణ



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరం ముదురుతున్న వేళ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు కొత్త వివాదాన్ని రాజేశాయి. చెన్నైలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో అన్నాడీఎంకే–బీజేపీ పొత్తును విమర్శిస్తూ ప్రధాని మోదీపై ఆయన చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత దూషణల స్థాయికి చేరాయంటూ బీజేపీ మండిపడుతోంది. మోదీకి, బీజేపీకి సమానత్వంపై ఏమాత్రం విశ్వాసం లేదని, అటువంటి వారితో అన్నాడీఎంకే ఎలా చేతులు కలిపిందని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఉద్దేశించి ఖర్గే చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా పరిగణించింది. ఈ అవమానకర వ్యాఖ్యలకు గానూ ఖర్గేతో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఖర్గే స్పందిస్తూ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. “నేను ప్రధాని మోదీని ఎప్పుడూ ఉగ్రవాది అని అనలేదు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రజలను, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పడమే నా ఉద్దేశం” అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలను తప్పుగా చిత్రీకరించవద్దని కోరారు. తమిళనాడులో డీఎంకే–కాంగ్రెస్ కూటమిని మరోసారి గెలిపించాలని కోరుతూ ఖర్గే తన పర్యటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ వైఖరి వల్ల దేశంలోని ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని ఆయన ఆరోపించారు. అయితే, ఖర్గే వివరణను బీజేపీ తిరస్కరిస్తోంది. ప్రధానిని కించపరచడం కాంగ్రెస్ అలవాటుగా మార్చుకుందని, ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఇలాంటి దిగజారుడు విమర్శలు చేస్తున్నారని బీజేపీ నేతలు ప్రత్యారోపణలు చేస్తున్నారు. ఎన్నికల వేళ ఈ ‘మాటల యుద్ధం’ ఓటర్లపై ఎటువంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

# బీహార్ ఎంపీ ‘పడకగది’ వ్యాఖ్యల దుమారం

- రాజకీయాల్లో మహిళలపై జుగుప్సాకర విమర్శలు
- బెడ్‌రూమ్ నుంచే మహిళల రాజకీయ ప్రస్థానమంటూ వ్యాఖ్య..
- భగ్గుమన్న మహిళా లోకం.. రంగంలోకి బిహార్ మహిళా కమిషన్..
- ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలని బీజేపీ డిమాండ్



**పాట్నా:** దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్లపై సానుకూల చర్చ జరుగుతున్న తరుణంలో, బిహార్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్ అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రాజకీయ వర్గాల్లో అగ్గి రాజేశారు. మహిళల రాజకీయ ఎదుగుదలను కించపరిచే విధంగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. 90 శాతం మంది మహిళల రాజకీయ జీవితం నాయకుల ‘పడకగది’ (బెడ్‌రూమ్) నుంచే ప్రారంభమవుతుందంటూ ఆయన చేసిన అసభ్యకర వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. ఓ సందర్భంలో మాట్లాడిన పప్పూ యాదవ్.. రాజకీయ నాయకులందరూ మహిళలపై కన్నేసి వారిని వేధిస్తున్నారని ఆరోపించారు. అమెరికా నుంచి భారత్ వరకు ప్రతిచోటా ఇదే పరిస్థితి ఉందని, నిత్యం ఎవరో ఒక నాయకుడి వికృత చేష్టలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు బయటపడుతూనే ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న ఈ రోజుల్లో ఒక బాధ్యతాయుతమైన ఎంపీ పదవిలో ఉండి మహిళల క్యారెక్టర్‌ను కించపరిచేలా మాట్లాడటంపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### మహిళా కమిషన్ నోటీసులు

పప్పూ యాదవ్ వ్యాఖ్యలను బిహార్ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొంటూ ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీనిపై తక్షణమే వివరణ ఇవ్వాలని ఆదేశించింది. మరోవైపు బీజేపీ ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించింది. మహిళల పట్ల ఇంతటి హీనమైన ఆలోచనలు ఉన్న వ్యక్తిని పార్లమెంట్ నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసింది.

### సోషల్ మీడియాలో వైరల్:

2024 లోక్‌సభ ఎన్నికల్లో పూర్ణియా నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన పప్పూ యాదవ్ వ్యాఖ్యల వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. పార్టీలకు అతీతంగా మహిళా నేతలు ఆయన వైఖరిని ఎండగడుతున్నారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని కోరుకుంటున్న తరుణంలో, ఇలాంటి వ్యాఖ్యలు మహిళా లోకాన్ని మానసిక క్షోభకు గురిచేస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# స్తంభంపల్లి బాలుర గురుకులంలో 'ప్రజాపాలన' పోటీలు



**నేటి సాక్షి, జగిత్యాల(గుండ ప్రశాంత్ గౌడ్):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామంలోని ఎంజేపీటీ బీసీ డబ్ల్యూఆర్ఎస్ (మహాత్మా జ్యోతిబాపూలే) బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, చిత్రలేఖనం ఉపన్యాసం క్విజ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించగా వారు చురుగ్గా పాల్గొని తమ అద్భుతమైన ప్రతిభను కనబరిచారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ హరిత మాట్లాడుతూ. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వారి ప్రతిభను సానబెట్టేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. పాఠశాలలో ఇటువంటి విద్యాపరమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేసి, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ రహీం, డీడబ్ల్యూ దివ్య, పాఠశాల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సరదా ఈత విషాదంగా మారకూడదు

## మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దు చిన్న నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి దారితీయవచ్చు



**నేటి సాక్షి, జగిత్యాల(పూరెల్ల బాపు):** వేసవి కాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో పిల్లలు, యువకులు ఈత నేర్చుకోవడానికి చెరువులు, కాలువల వద్దకు ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున ఇట్టి క్రమంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణ నష్టం జరుగుతుండటం వలన అందరూ ఇట్టి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈత సరదా విషాదంగా మారకూడదు అని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ సూచించారు. ఈత రానివారు బావులు, చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని ఈతను నేర్చుకునే వారు వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యశీగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువుల వద్దకు కాలువల వద్దకు కుంటలు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినట్లయితే పిల్లల ప్రాణానికి ప్రమాదమని ఇట్టి విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని పిల్లలను యొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక శ్రద్ధ ఉంచడం జరిగినదని తల్లిదండ్రుల, మైనర్లకు వాహనం ఇవ్వకూడదని, వాహనం ఇచ్చినచో వారు తెలిసి తెలియని డ్రైవింగ్ తో వాహనం నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, దానితో వారికి మరియు ఎదుటి వ్యక్తులకు ప్రమాదం జరగటం వల్ల రెండు కుటుంబాలు నష్ట పోతున్నాయని కావున మైనర్ లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ మైనర్ కు వాహనం ఇచ్చి ఏదైనా ప్రమాదం జరిగిన లేదా మైనర్ డ్రైవింగ్ చేస్తూ వాహనం తో పట్టుబడిన వాహన యజమాని పై కేసు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.

# కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ



**నేటిసాక్షి, మిర్యాలగూడ:** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వేములపల్లి మరియు మాడ్గులపల్లి మండలాలకు చెందిన 60 మంది లబ్ధి దారులకు రూ.60లక్షల 6వేల 960 లు విలువ గల, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సహాయం అందిస్తోందని, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడడమే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పథకాలను పారదర్శకంగా, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందజేస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు, మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బిఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మరకత శివాలయ విరాళాలు ఆలయ అభివృద్ధి కే..

- ధర్మకర్త వెంకటేశ్వరరావు
- దేవాదాయ శాఖ నోటీసులపై స్పందించిన ఆలయ కమిటీ.. ప్రతి రూపాయికి లెక్క ఉందని వెల్లడి



**నేటి సాక్షి,శంకర్‌పల్లి :** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయానికి దాతలు, భక్తులు ఇచ్చే ప్రతి పైసా ఆలయ అభివృద్ధి కొరకే వినియోగిస్తున్నామని ఆలయ ధర్మకర్త వెంకటేశ్వరరావు (వీడియో రావు) స్పష్టం చేశారు. మంగళవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

దేవాదాయ శాఖ నోటీసులపై వివరణ:

గత ఐదేళ్ల ఆలయ ఆదాయ వ్యయాల లెక్కలు చూపాలని దేవాదాయ శాఖ అధికారులు 15 రోజుల క్రితం నోటీసులు ఇచ్చారని, దీనిపై తాము స్పందిస్తూ వివరాలు సేకరించేందుకు మూడు నెలల గడువు కోరామని ఆయన తెలిపారు. ఆలయ నిధుల్లో ఎలాంటి దుర్వినియోగం జరగలేదని ఆయన భరోసా ఇచ్చారు.

అభివృద్ధి పథంలో ఆలయం:

2012లో గ్రామస్తుల సహకారంతో పురాతన ఆలయాన్ని పునర్నిర్మించామని, గతంలో అర్చకులకు జీతాలు ఇవ్వడమే కష్టంగా ఉండేదని గుర్తు చేశారు. కోవిడ్ సమయంలో భక్తులు లేక ఆలయం ఎన్నో ఇబ్బందులు పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 నుండి భక్తుల తాకిడి పెరగడంతో దాతల సహకారంతో ప్రతి ఆది, సోమవారాలు మరియు పౌర్ణమి రోజుల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

భక్తుల సౌకర్యార్థం వసతి గదులు:

శివరాత్రి, కార్తీక మాసాల్లో వచ్చే భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ సహకారంతో 800 గజాల స్థలంలో అన్నదాన సత్రం, వసతి గదులను నిర్మించామని తెలిపారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా ఆలయ అభివృద్ధి పనులకే వాడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి అభిషేకానికి, అన్నదానానికి భక్తులకు రశీదులు అందజేస్తున్నామని, దూరప్రాంత భక్తుల కోరిక మేరకు లడ్డూ, పులిహోర ప్రసాదాలు అందుబాటులో ఉంచామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్, కోశాధికారి జనార్ధన్, మాజీ చైర్మన్ సదానందం గౌడ్, మాజీ వైస్ చైర్మన్ హన్మంతు, కమిటీ సభ్యులు దేవేందర్ రెడ్డి, సాగర్, సుధీర్ గౌడ్, లీలావతి, విట్టలయ్య, అనంతయ్య, వెంకటస్వామి, నవీన్, అర్చకులు సాయి శివ ప్రసాద్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల గర్జనతో దద్దరిల్లిన నంద్యాల కలెక్టరేట్



- పిఆర్టియు ఆధ్వర్యంలో మహా ధర్నా.. 25న 'చలో విజయవాడ'కు పిలుపు




**నేటి సాక్షి నంద్యాల:** ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్, ఆంధ్ర ప్రదేశ్ సంఘం పిలుపు మేరకు ఈ రోజు 21-04-2026 న నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద, పి ఆర్ టి యు నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎన్.వి. భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై రాంపక్కి రెడ్డి ల అధ్యర్యంలో మహా ధర్నాను చేపట్టారు. వెయ్యి మంది ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలో వచ్చాక ఉద్యోగ , ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్‌సి ఐఆర్ పెండింగ్ డిఎలు వంటి అంశాలపై హామీ ఇచ్చిన ఇంత వరకు నెరవేర్చకపోవడం శోచనీయం అని వెంటేనే పి అర్ సి కమిషన్ ఏర్పాటు చేసి, 30% IR చెల్లిస్తూ పెండింగ్ డిఎ లు విడుదల చేయాలని కోరారు. పిఆర్‌టియు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన పాలకుల నిర్లక్ష్యం ఉద్యోగ, ఉపాధ్యాయుల పై అలాగే కొనసాగుతుందని, దీనిని అడ్డుకుంటామని, సిపిఎస్ రద్దు చేయాలని, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ వర్తింపు చేయాలి, మెమో 57 అమలు పరచాలని, 2022 నుంచి పెండింగ్ లో వున్న సరెండర్ లీవ్ చెల్లించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై రాంపక్కి రెడ్డి మాట్లాడుతూ అనేక ఆశలతో ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, 2 సంవత్సరాలైన మన ప్రధాన డిమాండ్లను పెండింగ్ లో పెట్టడం నిర్లక్ష్య ధోరణికి నిదర్శనంగా ఉందని, ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు అన్ని చెల్లించాలని, రిటైర్ అవుతున్న ఉపాధ్యాయులకు వారి పదవీ విరమణ రోజే వారి చెందాల్సిన ప్రయోజనాలు చెల్లించాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయులైన డీఎస్సీ 1998,2008 వారిని రెగ్యులర్ చేయాలి, వారికి 12నెలల జీతం చెల్లించాలి అని కోరారు. అలాగే ఎయిడెడ్, మున్సిపల్, మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ, కేజీబీవీ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి అని కోరారు. చాలా పెద్ద ఎత్తున ఎండ వేడి లెక్క చేయకుండా ఉపాధ్యాయులు నిరసన గళం ఎత్తారని, ఇకనైనా ప్రభుత్వం స్పందించకుంటే ఏప్రిల్ 25 తేదీన చలో విజయవాడ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గారికి ఉపాధ్యాయ సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్ భార్గవ రామయ్య,రాష్ట్ర నాయకులు కె కృష్ణారావు, గోపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, విజయ్ రావు, ఇబ్రహీం, రాంపుల్ల రెడ్డి, మధుసూదన్, వై.వి.రమణయ్య, పి నూర్ మొహమ్మద్, హుస్సేన్ సాహెబ్, హనుమంతు, రవీంద్ర రెడ్డి, జాకీర్ కె శ్రీనివాసులు , గా.వీ బాషా, జేసీ నరసింహులు, సుమియన్, జగదీశ్ బాబు, జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులుమహిళా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ మంత్రులకు సింగపూర్‌లో ఘన స్వాగతం





- సింగపూర్ లో ఉన్న తెలుగు అసోసియేషన్ వారు

**నేటి సాక్షి పాములపాడు:** నంద్యాల జిల్లా, నందికొట్కూరు నియోజవర్గం, పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామానికి చెందిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత & తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు సింగపూర్ దేశానికి మూడు రోజుల శిక్షణ కొరకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులకు మా హృదయపూర్వక మరియు ఘన స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు, అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు ప్రత్యేక శిక్షణ కొరకు సింగపూర్ కు వచ్చిన కింజారపు.అచ్చెన్నాయుడు (వ్యవసాయం, పశుసంవర్ధక, పాల అభివృద్ధి మరియు మత్స్యశాఖల మంత్రి), పొంగూరు.నారాయణ (మునిసిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖల మంత్రి), వంగలపూడి.అనిత (గృహ వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ ల శాఖ మంత్రి), సత్య కుమార్ యాదవ్ (ఆరోగ్యం, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి), అనగాని సత్య ప్రసాద్ (రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ మరియు స్టాంపుల శాఖల మంత్రి), బి.సి.జనార్ధన్ రెడ్డి(రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖల మంత్రి), మంత్రివర్యులను కలుసుకుని అందరికీ పుష్పగుచ్చాలు చేతికి అందించి ఘనంగా ఆత్మీయ స్వాగతం పలకడం జరిగింది. వారి యోగక్షేమాల గురించి, కుశల ప్రశ్నలు అడిగి తెలుసుకోవడం చాలా ఆనందంగా ఉందనీ అన్నారు.

# "ఏక్ బార్ దేఖో ఎమ్మెల్యే గారు"

- గిరిజన బిడ్డల గళం
- ఏడాది దాటినా అందని కళ్యాణ లక్ష్మి చెక్కులు..
- డోర్నకల్‌లో గిరిజనుల ఆగ్రహం




**నేటి సాక్షి,మహబూబాబాద్ :** డోర్నకల్ నియోజకవర్గంలో గిరిజన కుటుంబాల ఆవేదన ఇప్పుడు కట్టలు తెంచుకుంటోంది. గిరిజనుల కోసం కేటాయించిన నియోజకవర్గంలో, గిరిజన సామాజిక వర్గానికే చెందిన ఎమ్మెల్యే ఉన్నప్పటికీ.. తమకు న్యాయం జరగడం లేదని గిరిజన బిడ్డలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణ లక్ష్మి పథకం కింద అందాల్సిన ఆర్థిక సహాయం ఏడాది దాటినా అందకపోవడంతో బాధితులు రోడ్డెక్కుతున్నారు.

**ఎన్నికల హామీలు.. అందని ద్రాక్షలేనా**

ఎన్నికల సమయంలో "నెల రోజుల్లోనే చెక్కులు ఇస్తాం.. అదనంగా తులం బంగారం అందజేస్తాం" అని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టలేక ఆర్థికంగా కుదేలవుతున్నామని బాధితులు వాపోతున్నారు. "ఏక్ బార్ దేఖో ఎమ్మెల్యే గారు డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్" అంటూ తమ గోడును వినాలని నిలదీస్తున్నారు. హామీలను నమ్మి ఓటేసిన తమను ప్రభుత్వం మోసం చేసిందని గిరిజన తండాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**బీసీ, ఎస్సీలకు ఓ న్యాయం.. గిరిజనులకు మరో న్యాయమా?**

> **నెల రోజుల్లో ఇస్తామన్న హామీ ఎటు పోయింది?**
>
> **తులం బంగారం మాటలు మాయమయ్యాయా?**
>
> **గిరిజన నియోజకవర్గంలోనే గిరిజనులకు అన్యాయమా?**
>
> **అప్పుల ఊబిలో ఉన్న గిరిజన కుటుంబాల బాధ్యత ఎవరిది?**

ఇతర వర్గాలకు చెందిన బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు చెక్కులు అందుతున్నాయని, కేవలం గిరిజన బిడ్డలకే ఈ అన్యాయం ఎందుకు జరుగుతోందని వారు ప్రశ్నిస్తున్నారు. గిరిజన నియోజకవర్గంలోనే గిరిజనులకు ప్రాధాన్యత లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "మా చెక్కులు ఎప్పుడు వస్తాయి? మాకు న్యాయం ఎప్పుడు జరుగుతుంది?" అంటూ బాధితులు గళమెత్తుతున్నారు.

**ఆందోళన బాటలో గిరిజన బిడ్డలు:**

ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మి చెక్కులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# ఏప్రిల్ 24 న చలో ఫతేపూర్

**మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ. గోడ పత్రిక ఆవిష్కరణ.**



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా నవపేట్ మండల పరిధిలోని మహనీయుల విగ్రహాల ముందు చలో ఫతేపూర్ గోడ పత్రిక అవిష్కరణ మండల కేంద్రంలో శంకర్పల్లి మున్సిపాలిటీ పతేపూర్ గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణకు నవపేట్ మండల కేంద్రంలో ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కడిగాళ్ల ప్రవీణ్ మాదిగ రవీందర్ వచ్చి గోడపత్రిక ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో ప్రవీణ్ మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్థానిక ఎమ్మెల్యే యాదయ్య ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి చేవెళ్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పామేనా భీమ్ భరత్ గారు కళాకారులు ప్రజాయుద్ధ నౌక డాక్టర్ ఏపూరి సోమన్న గారు రేలారే గంగా మున్సిపాలిటీలోని నాయకులందరూ రానున్నారు అని వారు అన్నారు మండల కేంద్రం నుండి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలోమీరా జిల్లా నాయకులు రవి కుమార్ మాదిగ MRPS వికారాబాద్ మండల ఇంచార్జి చిట్టిగిద్ద కిష్టయ్య మాదిగ సిపిఎం జిల్లా నాయకులు గోపాల్ రెడ్డి మండల అధ్యక్షులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# ఐకెపి కేంద్రాన్ని తనిఖీ

**రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి**

**ధాన్యం ఎగుమతులు వేగంగా నిర్వహించాలి**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ధాన్యం కొనుగోలులో ఎటువంటి అవకతవకలు లేకుండ వేగంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండల కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐకెపి కేంద్రాన్ని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ తో కలిసి మంగళవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం ఎగుమతులు వివరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దాన్యం ఎగుమతులు వేగంగా నిర్వహించాలని, ఎలాటి అవకతవకలకు తావు లేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మోతుబరి రైతుకు 'అసైన్‌మెంట్' పట్టా ఎలా

- నకిలీ డాక్యుమెంట్లతో సివిల్ కేసులు.. లోక్ అదాలత్‌లో బెదిరించి రాజీ!
- రెవిన్యూ అధికారుల అండతోనే అక్రమాలు.. కాగతిలో భూ దందాపై గ్రామస్తుల ఆగ్రహం



**నేటి సాక్షి,చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం కాగతి గ్రామ పంచాయతీలో రెవిన్యూ అక్రమాలు బట్టబయలవుతున్నాయి. అట్టడుగు వర్గాలకు అందాల్సిన ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములను, రాజకీయ అండదండలతో ఒక మోతుబరి రైతు తన వశం చేసుకున్న తీరు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నకిలీ పత్రాలతో కోర్టులను సైతం తప్పుదోవ పట్టిస్తూ, పేదల భూములను కాజేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగతి రెవిన్యూ సర్వే నంబర్ 80/3లో 5.54 ఎకరాల భూమిని ఒక మోతుబరి రైతు (వై. సదానంద రెడ్డి) పేరుతో అసైన్‌మెంట్ పట్టా ఇచ్చినట్లు రికార్డుల్లో చూపిస్తోంది. నిజానికి సదరు రైతుకు ఇప్పటికే వివిధ సర్వే నంబర్లలో 10.678 ఎకరాల సెటిల్మెంట్ భూమి కలదు. నిబంధనల ప్రకారం మాగాణి 2.50 ఎకరాలు, మెట్ట 4.99 ఎకరాల లోపు ఉన్నవారికే అసైన్‌మెంట్ ఇవ్వాలి. కానీ, ఇప్పటికే పది ఎకరాలకు పైగా భూమి ఉన్న వ్యక్తికి ఏ చట్టం ప్రకారం 5.54 ఎకరాల పట్టా ఇచ్చారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ భూ వ్యవహారంలో పక్కా ప్లాన్ ప్రకారం సివిల్ కేసులు వేసి, సమన్స్ స్టేజీలోనే బాధితులను బెదిరించి లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో లింగం మునస్వామి అనే బీసీ వ్యక్తికి కేటాయించిన డి-ఫాం పట్టా భూమిని, సదానంద రెడ్డి అనే రైతు తన పేరున మార్చుకోవడానికి కోర్టు కేసులను అస్త్రంగా వాడుకున్నారు. లోక్ అదాలత్ జడ్జిమెంట్ కాపీలను అడ్డం పెట్టుకుని పట్టాదారు పాసుపుస్తకాలు పొందడం వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తరతరాలుగా పశువులు, గొర్రెల కాపరులు వాడుకునే దారిని సైతం సదరు రైతు పూర్తిగా మూసివేశారు. దీనిపై తహశీల్దార్ గతంలో గ్రామ రెవిన్యూ అధికారికి దారి పునరుద్ధరించాలని ఆదేశాలు ఇచ్చినా, రాజకీయ ఒత్తిళ్లతో అవి బుట్టదాఖలయ్యాయి. గతంలో దారి సమస్య ఉందని అంగీకరించిన అధికారులే, ఇప్పుడు అక్కడ సమస్యే లేదని సమాధానం ఇవ్వడం వెనుక ఉన్న 'లాబీయింగ్' ఏమిటని బాధితులు నిలదీస్తున్నారు. ఒకే సర్వే నంబర్‌పై ఇద్దరు రైతులకు 1-బిలు రావడం రెవిన్యూ వ్యవస్థలోని లోపాలకు నిదర్శనమని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఆర్టీఐ ద్వారా సమాచారం అడిగితే బెదిరింపులకు దిగుతున్న అధికారులపై, ప్రభుత్వ భూమిని అక్రమంగా పొందిన సదానంద రెడ్డిపై తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేసి, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కాగతి వాసులు కోరుతున్నారు.

# ఆస్తి పన్ను వసూళ్లు

- ట్రేడ్ లైసెన్సులపై ఫోకస్‌ఎండింగ్ బకాయిలు చెల్లించి మిర్యాలగూడ అభివృద్ధికి సహకరించండి : కమిషనర్ శ్రీనివాస్



నేటిసాక్షి, మిర్యాలగూడ : పట్టణ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లు మరియు ట్రేడ్ లైసెన్సులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగర అభివృద్ధికి అవసరమైన ఆదాయ వనరులను బలోపేతం చేయడం అత్యంత అవసరమని ఆయన ప్రజలకు సూచించారు. మంగళవారం పట్టణంలోని వ్యాపారులు మరియు ఆస్తి యజమానులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజలు తమ బాధ్యతలను సమయానికి నిర్వర్తించాలని, ట్రేడ్ లైసెన్సుల విషయమై, పట్టణంలోని అన్ని వ్యాపార సంస్థలు మరియు వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్సుల పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి లైసెన్సులను తప్పనిసరిగా రీన్యువల్ చేసుకోవాలని స్పష్టంగా ఆదేశించారు. ట్రేడ్ లైసెన్సులు లేకుండా వ్యాపారం నిర్వహించడం చట్ట విరుద్ధమని, అటువంటి వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్తి పన్ను విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 5% రిబేట్ అవకాశాన్ని వినియోగించుకొని, పట్టణంలోని అన్ని ఆస్తి యజమానులు తమ పన్ను బకాయిలను తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చి, ఆస్తి పన్ను చెల్లిస్తున్న సీనియర్ సిటిజన్లకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మిర్యాలగూడ పట్టణ అభివృద్ధి మరియు మౌలిక వసతుల మెరుగుదలకు, ప్రతి పౌరుడు సహకరించాలని, ట్రేడ్ లైసెన్సులు కలిగిన వారు లైసెన్సులను రీన్యువల్ చేసుకోవాలని, ఆస్తి యజమానులు 5% రిబేట్‌ను వినియోగించుకొని పన్నులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, అందరూ తమ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్లో ఏసీబీకి చిక్కిన మహిళ

**ఎస్సైరాణి మహిళా సిఐ సరోజ.డబ్బులు ఇస్తే ఎలాంటి కుటుంబం ఐనా విడదీసే మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సరోజ.**

**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన షేక్ ఇర్షాద్ బార్య తనను వేధిస్తున్నాడని బార్య ఇచ్చిన పిర్యాదు మేరకు 498 కేసు నమోదు చేసింది వికారాబాద్ మహిళా సీఐ సరోజ. ఇర్షాద్ అతని కుటుంబ సభ్యులు ఆరు మందిపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇస్తామని ప్రతి ఒక్కరికి పదివేల రూపాయలు చొప్పున 60000 లంచం డిమాండ్ చేసారు సిఐ సరోజ, ఎసై రాణి 40 వేల రూపాయలు ఇస్తానని భాదితుడు ఒప్పుకున్నాడు, దీంట్లో భాగంగా 20 వేల రూపాయలు సిఐ సమక్షంలో ఎస్ఐ కి ఇవ్వగా మిగతా 20 వేల రూపాయలు ఇచ్చే క్రమంలో ఏసీబీని ఆశ్రయించాడు బాధితుడు. ఎసిబి డిఎస్పి ఆనంద్ కుమార్ ఆద్వర్యంలో మహిళా పోలీస్ స్టేషన్లో తనిఖీలు నిర్వహించి విచారణ చేపట్టారు. ఏక కాలంలో సిఐ సరోజ బందువుల ఇంట్లో కూడ సోదాలు నిర్వహిస్తున్నారు ఏసీబీ అధికారులు. భార్య భర్తల కేసులో సీఐ సరోజ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుందని, వికారాబాద్ జిల్లాలో పేద ప్రజల రక్తం తాగుతుందని ఇలాంటి వాళ్ళను కఠినంగా శిక్షించాలని కోరుతున్నాడు తాండూరు కౌన్సెలర్ ఇర్షాద్.పోలీస్ స్టేషన్లో హోంగార్డు కానిస్టేబుల్ ను డబ్బులకోసం పెట్టుకున్నట్టు సమాచారం. ఇక్కడ ఈ కార్యక్రమంలో ఏసీబీ జిల్లా అధికారులు పాల్గొన్నారు

# సబ్బుపై చెక్కిన అభిమానం

**కొప్పులకు యువ నేతల వినూత్న జన్మదిన కానుక**

**నేటి సాక్షి, ఎండపల్లి:** మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినం సందర్భంగా ధర్మపురి నియోజకవర్గ యువ నాయకులు వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు. జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కప్పరావుపేటకు చెందిన యువ నాయకుడు బత్తిని భరత్ సబ్బుపై కొప్పుల ఈశ్వర్ ప్రతిమను ఆకృతిగా చెక్కించి ప్రత్యేక బహుమతిగా అందజేశారు. యువతలో ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటేలా ఈ వినూత్న కానుక నిలిచింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొప్పుల ఈశ్వర్ ప్రజలకు చేసిన సేవలు, నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ నాయకులు దేవి నళిని కాంత్, తరాల్ల కార్తీక్ తదితరులు పాల్గొని కొప్పుల ఈశ్వర్‌ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





# చాహల్ వద్దు.. కోహ్లీ లాంటోడు కావాలి

**బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా**

టీమిండియా వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో తాను డేటింగ్ చేస్తున్నట్లు వచ్చిన వార్తలను బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా కొట్టిపారేసింది. ఇలాంటి వార్తలతో తాను విసిగిపోయానని అసహనం వ్యక్తం చేసింది. కలిసి డిన్నర్ చేసినంత మాత్రాన డేటింగ్ అంటూ ప్రచారాం చేస్తారా? అని మండిపడింది. యుజ్వేంద్ర చాహల్‌తో కలిసి షెఫాలీ బగ్గా ఉన్న వీడియో ఒకటి వైరల్ కావడంతో ఈ ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే పుకార్లు వెలువడ్డాయి. తాజాగా ఈ వార్తలపై స్పందించిన షెఫాలీ బగ్గా.. తనకు చాహల్ వద్దని, కోహ్లీలాంటి అబ్బాయి కావాలని పేర్కొంది. ఇలాంటి చిన్న చూపుతో తాను విసిగిపోయానని పేర్కొంది. వాస్తవం ఏంటో తనకు, తన ఆత్మీయులకు తెలుసు అని పేర్కొంది. తనకు క్రికెటర్లతో డేటింగ్ చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. 'ఇది నా వృత్తి. నా ప్రొఫెషన్, వ్యక్తిగత జీవితాన్ని కలిపే ఉద్దేశం అస్సలు లేదు. అందుకే క్రికెటర్లతో డేటింగ్ చేసే ఆలోచన నాకు లేదు. నాకు విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి. అతను ఎంత బిజీగా ఉన్నా అనుష్క పట్ల చూపించే ప్రేమ, అంకితభావం, ఆరాధన నాకు చాలా ఇష్టం. నా భాగస్వామి నాతో ఉన్నప్పుడు పూర్తిగా నాకే సమయం కేటాయించాలి. నాపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలి. నా పార్ట్‌నర్‌కు లగ్జరీల కంటే ప్రేమించే మనసు,నన్ను కేర్ చేసే గుణం ఉంటే చాలు. ప్రస్తుతానికి ప్రేమ, పెళ్లి లాంటి విషయాల కంటే నా కెరీర్‌కే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాను. 'అని షెఫాలీ బగ్గా చెప్పుకొచ్చింది. ఐపీఎల్ లాంటి ప్రతిష్టాత్మక టోర్నీలకు యాంకర్‌గా వ్యవహరిస్తున్న షెఫాలీ.. త్వరలో బాలీవుడ్, సౌత్ ఇండియన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.



# చిక్కుల్లో యూసఫ్ పఠాన్

మహానగరం ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో జరిగిన ఒక చిన్న వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, చివరకు పోలీసు కేసులకు దారితీసింది. టీమ్ ఇండియా మాజీ ఆటగాడు యూసుఫ్ పఠాన్ మామ, ఆయన కుమారుడు మరియు మరో బంధువు కలిసి ఒక వ్యక్తిపై, అతని కుటుంబంపై దాడి చేశారనే ఆరోపణలతో ముంబై పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ గొడవ రెండు రోజుల క్రితం ప్రారంభమైంది. ముంబైలో కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతల్లో నీరు చేరింది. ఆ దారిలో వెళ్తున్న ఒక కారు, గుంతలోని నీటిని రోడ్డు పక్కన ఉన్న వ్యక్తిపై చిమ్మింది. ఈ చిన్న కారణంతో ఆగ్రహానికి గురైన నిందితులు, కారులో ఉన్న వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. అది కాస్తా ముదిరి పరస్పర దాడుల వరకు వెళ్లింది. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన బైకుల్లా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించారు. ఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ కెమెరాల ద్వారా నిందితులను స్పష్టంగా గుర్తించారు. దాడికి ఉపయోగించిన వెదురు కర్రలు, బేస్ బాల్ బ్యాట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (గతంలో ఐపీసీ) లోని సెక్షన్ 118(2), 115(2), 324, 352, 351(2), మరియు 3(5) కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం ముగ్గురిని అరెస్ట్ చేయగా, ఈ కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. నిందితులను కోర్టులో హాజరుపరిచినప్పుడు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు మరియు సీసీటీవీ ఫుటేజ్ తమ వద్ద బలంగా ఉన్నాయని పోలీసులు కోర్టుకు వివరించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచార పర్వం కొనసాగుతున్న తరుణంలో,ఒక సిట్టింగ్ ఎంపీ అయిన యూసుఫ్ పఠాన్ బంధువులు ఇలాంటి గొడవల్లో అరెస్ట్ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రత్యర్థి పార్టీలు ఈ అంశాన్ని ప్రచారంలో ప్రస్తావించే అవకాశం కనిపిస్తోంది. నగరాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, ఒత్తిడి వల్ల చిన్న చిన్న కారణాలకే ప్రజలు విచక్షణ కోల్పోయి దాడులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డుపై వెళ్లేటప్పుడు సహనం పాటించకపోతే, అది ఎంతటి వారినైనా చట్టం ముందు నిలబెడుతుందని ఈ ఘటన మరోసారి నిరూపించింది. పోలీసులు పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# సొంతగడ్డపై సన్ రైజర్స్ శివతాండవం!




## అభిషేక్ శర్మ సుడిగాలి శతకం

**ఢిల్లీ క్యాపిటల్స్ పై 47 పరుగుల తేడాతో ఘనవిజయం**

## ఉప్పల్ లో చెలరేగిన బ్యాటర్లు, బౌలర్లు



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** ఐపీఎల్ టోర్నీలో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు సొంతగడ్డపై మరోసారి విశ్వరూపం ప్రదర్శించింది. ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా మంగళవారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టును చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణించి 47 పరుగుల భారీ తేడాతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ ఏకంగా 242 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ జట్టు 195 పరుగులకే పరిమితమై పరాజయాన్ని మూటగట్టుకుంది.

**టాస్ గెలిచి బొక్కబోర్లా పడ్డ ఢిల్లీ..**

ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు అనుకూలిస్తున్న పిచ్ పై ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయాలన్న వ్యూహం దారుణంగా బెడిసికొట్టింది. సన్ రైజర్స్ ఓపెనర్లు ఆది నుంచే విరుచుకుపడ్డారు. ముఖ్యంగా యువ సంచలనం అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ మైదానం నలుమూలల బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 68 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు సాధించి జట్టుకు భారీ స్కోరును అందించాడు. అతనికి జతగా ట్రావిస్ హెడ్ (26 బంతుల్లో 37 పరుగులు) చక్కటి సహకారం అందించాడు. చివర్లో హెన్రిచ్ క్లాసెన్ కేవలం 13 బంతుల్లోనే 37 పరుగులతో అజేయంగా నిలిచి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. నిర్ణీత 20 ఓవర్లలో హైదరాబాద్ జట్టు 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల కొండంత స్కోరును నమోదు చేసింది. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ ఒక్క వికెట్ పడగొట్టాడు.

**లక్ష్య ఛేదనలో తడబడిన ఢిల్లీ..**

243 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఏ దశలోనూ విజయావకాశాలు కనిపించలేదు. భారీ స్కోరు ఛేదించాలన్న ఒత్తిడిలో బ్యాటర్లు వరుసగా పెవిలియన్ కు క్యూ కట్టారు. నితీశ్ రాణా (30 బంతుల్లో 57 పరుగులు), సమీర్ రిజ్వీ (28 బంతుల్లో 41 పరుగులు), కేఎల్ రాహుల్ (23 బంతుల్లో 37 పరుగులు) పోరాడే ప్రయత్నం చేశారు. మిగతా బ్యాటర్లు ఎవరూ వారికి కనీస సహకారం అందించలేకపోయారు. పెరిగిన రన్ రేట్ ను చేరుకునే క్రమంలో భారీ షాట్లకు యత్నించి వికెట్లు పారేసుకున్నారు.

**కదం తొక్కిన హైదరాబాద్ బౌలర్లు..**

భారీ స్కోరును కాపాడుకునే క్రమంలో సన్ రైజర్స్ బౌలర్లు అద్భుతంగా రాణించారు. యువ పేసర్ ఇషాన్ మలింగ ఢిల్లీ బ్యాటింగ్ లైనప్ ను శాసించాడు. తన 4 ఓవర్ల స్పెల్ లో కేవలం 32 పరుగులు మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. హర్ష్ దూబే కూడా కేవలం 2 ఓవర్లలో 11 పరుగులిచ్చి 3 వికెట్లు నేలకూల్చాడు. సాకిబ్ హుస్సేన్ ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. హైదరాబాద్ బౌలర్ల ధాటికి ఢిల్లీ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 195 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ సీజన్ లో సన్ రైజర్స్ బ్యాటింగ్ లైనప్ ఎంత భయంకరంగా ఉందో ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది. ఓపెనింగ్ లోనే భారీ స్కోరుకు పునాది పడటంతో మిడిల్ ఆర్డర్ స్వేచ్ఛగా ఆడే అవకాశం దక్కుతోంది. అభిషేక్ శర్మ ఫామ్ ప్రత్యర్థి బౌలర్లకు పీడకలగా మారింది. బౌలింగ్ లోనూ యువ ఆటగాళ్లు సత్తా చాటుతుండటం ఆ జట్టుకు శుభసూచకం. ఏ రకంగా చూసినా ఈ మ్యాచ్ పై సన్ రైజర్స్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి అభిమానులకు అద్భుతమైన వినోదాన్ని పంచింది.



# ప్రఫుల్ హింగేపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వేటు



వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిపించిన యువ పేసర్ ప్రఫుల్ హింగేపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వేటు వేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఉప్పల్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో రెండు మార్పులతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ప్రఫుల్ హింగే, లివింగ్ స్టోన్‌లను తుది జట్టు నుంచి తప్పించి ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్ లిస్ట్‌లో చేర్చింది. పిచ్ స్పిన్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ తెలిపాడు. ఎక్కువ స్పిన్ ఆప్షన్స్ కోసం ప్రఫుల్ హింగేను పక్కనపెట్టామని చెప్పాడు. దిల్షాన్ మదుషంక తుది జట్టులోకి వచ్చాడని ఇషాన్ కిషన్ తెలిపాడు. అయితే ప్రఫుల్ హింగే, మదుషంకలో ఒకరే ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడుతారని చెప్పాడు. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన ఇషాన్ కిషన్.. గత మ్యాచ్‌లతో పోల్చితే ఇది భిన్నమైన వికెట్ అని తెలిపాడు. 'ఈ పిచ్‌పై ఇప్పుడే ఒక నిర్ణయానికి రాలేం. ఎందుకంటే గత కొన్ని మ్యాచ్‌ల్లో మేం ఆడిన వికెట్ లాగా ఇది లేదు. పిచ్ కండిషన్స్ బట్టి ఆడాల్సి ఉంది. ఈ రోజు మా తుది జట్టులో కొన్ని మార్పులు ఉన్నాయి, మధుషంక బరిలోకి దిగుతుండగా.. ప్రఫుల్ హింగే బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఈ విషయంపై నాకు క్లారిటీ లేదు. హర్ష్‌దూబే తిరిగి జట్టులోకి వచ్చాడు. ఎందుకంటే ఇది కొంచెం స్లో ట్రాక్. వికెట్లు తీయడానికి మాకు స్పిన్ ఆప్షన్ ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నాం. మా కుర్రాళ్లు అద్భుతంగా రాణిస్తున్నారు. ఫలితాలను చూసి ఈ మాట చెప్పడం లేదు. మా ప్రణాళికలను వారు అమలు చేస్తున్న విధానం, వారి మనస్థత్వం చూసి ఈ మాట అంటున్నా. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. టాస్ విషయంలో తమకు అదృష్టం కలిసి వస్తుందన్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 100 మ్యాచ్‌లు ఆడుతానని అనుకోలేదని, ఈ రోజు విజయం దక్కుతుందనే ఆశాభావంతో ఉన్నానని వెల్లడించాడు. తమ తుది జట్టులో ఒక మార్పు చేశామని చెప్పిన అక్షర్ పటేల్.. ఆకీబ్ స్థానంలో నితీష్ రాణా బరిలోకి దిగుతున్నాడని తెలిపాడు.



# నువేక్ష హాట్ షో

## ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో హల్‌చల్

యంగ్ బ్యూటీ నువేక్ష తన తాజా ఫోటోషూట్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్టైలిష్ లుక్స్‌తో ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ఈ హీరోయిన్, ఇప్పుడు మరింత గ్లామర్ టచ్‌తో ఫ్యాన్స్‌ను మెస్మరైజ్ చేస్తోంది. క్రీమ్ వైట్ కలర్ కట్‌అవుట్ డ్రెస్‌లో నువేక్ష కనిపించిన తీరు ప్రత్యేకంగా నిలిచింది. గోల్డ్ బకుల్ డీటైల్స్‌తో డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్ బోల్డ్‌గా ఉన్నప్పటికీ క్లాసీ లుక్‌ను ఇస్తోంది. నేచురల్ లైట్‌లో తీసిన ఈ ఫోటోలు డ్రీమీ ఫీల్‌ను కలిగిస్తూ ప్రతి ఫ్రేమ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. సన్‌లైట్ విండోస్ దగ్గర పోజులు ఇచ్చినా, డార్క్ బ్యాక్‌డ్రాప్ ముందు నిలిచినా నువేక్ష కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె ఎలిగెంట్ స్టైల్‌తో పాటు స్క్రీన్ ప్రెజెన్స్ ప్రతి ఫోటోలో హైలైట్ అవుతోంది. ఈ కొత్త అవతార్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, నువేక్ష అందంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు





# మోస్ట్ పాపులర్ స్టార్స్ జాబితా విడుదల

## టాప్‌లో ప్రభాస్, సమంత

## ఓరామాక్స్ విడుదల చేసిన మార్చి ర్యాంకింగ్స్

టాలీవుడ్ స్టార్ హీరోలు, హీరోయిన్లలో క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని మరోసారి స్పష్టమైంది. దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ తారలు మళ్లీ టాప్ స్థానాల్లో నిలిచారు. మార్చి నెలకు సంబంధించిన మోస్ట్ పాపులర్ ఫిలిం స్టార్ల జాబితాను ఓరామాక్స్ మీడియా విడుదల చేయగా, హీరోలలో ప్రభాస్, హీరోయిన్లలో సమంత అగ్రస్థానాల్లో నిలిచారు. హీరోల విభాగంలో ప్రభాస్ మొదటి స్థానాన్ని దక్కించుకోగా, ఆయన తరువాత అల్లు అర్జున్, విజయ్ దళపతి, షారుఖ్ ఖాన్, మహేష్ బాబు వరుసగా నిలిచారు. అలాగే రామ్ చరణ్, సల్మాన్ ఖాన్, రణవీర్ సింగ్, ఎన్టీఆర్, అక్షయ్ కుమార్ కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ ర్యాంకింగ్స్ స్టార్ హీరోల పాపులారిటీని మరోసారి చూపిస్తున్నాయి. హీరోయిన్ల జాబితాలో సమంత టాప్ ప్లేస్ సాధించగా, ఆమె తరువాత ఆలియా భట్, రష్మిక మందన్న, కాజల్ అగర్వాల్, సాయి పల్లవి ఉన్నారు. నయనతార, త్రిష, కృతి సనన్, శ్రీలీల కూడా ఈ జాబితాలో తమ స్థానాలను సంపాదించుకున్నారు. మొత్తంగా చూస్తే, సౌత్ మరియు బాలీవుడ్ తారలు కలిసి ఈ జాబితాలో ఆధిపత్యం చాటడం విశేషం. అభిమానుల్లో వీరి క్రేజ్ ఇంకా బలంగానే కొనసాగుతోందని ఈ ర్యాంకింగ్స్ స్పష్టం చేస్తున్నాయి

# ప్యారడైజ్ కోసం రెండేళ్ల సమయం కేటాయింపు

## నటి కాయదు లోహర్ సంచలన నిర్ణయం



తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో బాహుబలి వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ప్యారడైజ్' సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ 'ప్యారడైజ్' ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో 'సైజ్ జీరో' కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాయదు లోహర్ తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ అవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'ప్యారడైజ్' విడుదల తర్వాత ఆమె టాలీవుడ్‌లో టాప్ లీగ్‌లో చేరుతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుంది.

# సిల్వర్ అండ్ గోల్డ్ లుక్‌లో ఐశ్వర్య మేనన్

## మెరిసిపోతున్న 'స్పై' సుందరి! వైరల్ అవుతున్న లేటెస్ట్ ఫోటోషూట్..

## గ్లామర్ విందులో నెక్స్ట్ లెవెల్

దక్షిణాది చిత్రాల్లో తనదైన నటనతో మెప్పిస్తున్న అందాల తార ఐశ్వర్య మేనన్ తాజాగా చేసిన ఫోటోషూట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, కోలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ఫ్యాన్ బేస్‌ను సంపాదించుకుంది. టాలీవుడ్‌లో నిఖిల్ సరసన 'స్పై', కార్తికేయతో 'భజే వాయు వేగం' వంటి చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యింది. ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వనప్పటికీ, ఐశ్వర్య అందానికి మరియు నటనకు మాత్రం మంచి మార్కులే పడ్డాయి. తెరపై సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నా, సోషల్ మీడియాలో మాత్రం ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ తన అప్డేట్స్ షేర్ చేస్తూనే ఉంటుంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలు చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. సిల్వర్ మరియు గోల్డ్ కలర్ సీక్విన్ చీరలో ఐశ్వర్య దేవకన్యలా మెరిసిపోతోంది. దీనికి తోడు హెవీ ఎంబ్రాయిడరీ చేసిన కార్సెట్ బ్లౌజ్ ఆమె లుక్‌కు మరింత రాయల్ టచ్ ఇచ్చింది. స్టైలిష్ మేకప్, ఎలిగెన్స్ కలగలిసిన ఐశ్వర్య ఫోజులు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ తన గ్లామర్‌ను సరికొత్తగా ఆవిష్కరిస్తూ ఫ్యాన్స్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. "సినిమా రిజల్ట్ ఎలా ఉన్నా, నీ గ్లామర్ మాత్రం తగ్గేదేలే" అంటూ నెటిజన్లు కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో వైరల్ అవుతూ, ఐశ్వర్య మేనన్ క్రేజ్‌ను మరింత పెంచుతున్నాయి.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దు

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- అగ్రహారం ఫిల్టర్ బెడ్, రుద్రవరం ఇన్ టెక్ వెల్ క్షేత్రస్థాయి పరిశీలన



**నేటి సాక్షి,వేములవాడ(శివకుమార్):** వేసవి కాలం నేపథ్యంలో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వేములవాడ మండలం అగ్రహారం సమీపంలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తో పాటు రుద్రవరంలోని ఇన్ టెక్ వెల్‌ను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి ప్రక్రియ, పంపింగ్ సామర్థ్య మరియు స్టోరేజీ వివరాలను మిషన్ భగీరథ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఇంటికీ నల్లా నీరు అందేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. యంత్రాలకు ఏవైనా మరమ్మతులు ఉంటే త్వరితగతిన పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ముఖ్యంగా నీటి పారుదల శాఖ మరియు మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రాజెక్టులలో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఈఈలు అన్వర్, సుమలత, డీఈ రాము మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గన్నేరువరంలో పొద్దుతిరుగుడు రైతుల గోస

- కొనుగోలు కేంద్రం కోసం సీపీఐ డిమాండ్



**నేటి సాక్షి,గన్నేరువరం(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తమ పంటను దూర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోందని, దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి రైతుపై అదనపు భారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా కేంద్రాలు లేని అవకాశాన్ని ఆసరాగా చేసుకొని దళారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి గన్నేరువరంలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే, భవిష్యత్తులో మరికొంత మంది రైతులు ఈ పంటను పండించడానికి ఉత్సాహంగా ముందుకు వస్తారని వారు పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ప్రాంతాల అంజిరెడ్డి, మండల కార్యదర్శి చుక్కల్లా శ్రీశైలం, సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, నాయకులు బోయిన మల్లయ్య, ఎండి నయీమ్, నేత కొమురయ్య, రాపోలు రాయమల్లు, బూట్ల భాస్కర్, చుక్కల్లా కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలి

- మరికల్ గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ.. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలల్లో సంక్షేమ వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మరికల్‌లోని పీఎంశ్రీ సోషల్ వెల్ఫేర్ పాఠశాల మరియు రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్, రైస్ రూమ్ మరియు డైనింగ్ హాల్‌ను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. కిచెన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని సమయానికి అందించాలని స్పష్టం చేశారు. పాఠశాల భవనాన్ని కలియతిరిగిన ఆయన.. విద్యార్థులకు అవసరమైన ఫ్యాన్లు, లైట్లు తదితర వసతులపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి అనంతరం కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, పాఠశాల ప్రిన్సిపాల్, తహసీల్దార్, పీఆర్ ఈఈ, ఎంపీడీవో, ఉపాధ్యాయులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# అంగన్వాడీల్లో అందించే పోషకాహారం తీసుకోవాలి




- సూపర్వైజర్ నిహారిక
- మాలోతు తండా అంగన్వాడీ కేంద్రంలో
- పోషణ పక్వాడా కార్యక్రమం

**నేటిసాక్షి, మిర్యాలగూడ:** అంగన్వాడి కేంద్రంలో అందించే పోషకాహారం చిన్నారులు, బాలింతలు తప్పనిసరిగా స్వీకరించాలని అన్నారం సెక్టార్ సూపర్వైజర్ నిహారిక అన్నారు. మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఓ రేఖల మమత ఆదేశాల మేరకు ఈనెల తేదీ 09 నుండి 23 వరకు నిర్వహించే పోషణ పక్వాడాలో భాగంగా మంగళవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్నారం సెక్టార్ లోని మాలోతు తండా అంగన్వాడి సెంటర్‌లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ 0 నుండి 6 సంవత్సరాల చిన్నపిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి, గచిరుధాన్యాలు సిరు ధాన్యాల గురించి అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పోషకాహారం తప్పనిసరి తీసుకోవాలని అన్నారు. అంగన్వాడి కేంద్రంకి వచ్చే ప్రతి చిన్నారి, ఆత్మవిశ్వాసంతో పాఠశాలకు సిద్ధం కావడం లక్ష్యంగా అంగన్వాడి కేంద్రాలు పనిచేస్తున్నాయని, అంగన్వాడీ కేంద్రాలకు ఎవరైనా దాతలు సహకారం అందిస్తే వారు "పాంకుడి పోర్టల్" ద్వారా విరాళాలను అందించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, ఝాన్సీ రాణి, షబానా, నజీమా, యశోద, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరుగుతుంది

## అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిర్ర సతీష్ కుమార్



**నేటి సాక్షి,జగిత్యాల(పూరెళ్ల బాపు):** తెలంగాణ అమరవీరుల కుటుంబాలను, ఉద్యమకారులను గుర్తించి వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని వేయడం శుభపరిణామమని తెలంగాణ అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిర్ర సతీష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జగిత్యాలలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో సుమారు 1200 మంది తమ ప్రాణాలను బలిదానం చేశారని, గత ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిందని గుర్తు చేశారు. అయితే అప్పట్లో కేవలం 589 మందిని మాత్రమే గుర్తించి ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగాలు కల్పించారని పేర్కొన్నారు. మిగిలిన అమరవీరుల కుటుంబాలను కూడా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా అడుగులు వేయడం అభినందనీయమన్నారు. సీనియర్ నేత కె. కేశవరావు చైర్మన్‌గా, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల మరియు ఉద్యమకారుల కుటుంబాలకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# నారాయణపేటలో ఏసీబీ దాడులు

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్డీఓ



**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఏసీబీ అధికారులు భారీ దాడి నిర్వహించారు. రూ. 25 వేల లంచం తీసుకుంటూ నారాయణపేట ఆర్డీఓ (RDO) రామచందర్ నాయక్ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక పని నిమిత్తం బాధితుడి నుండి లంచం డిమాండ్ చేయగా, బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. ఈ మేరకు పథకం ప్రకారం దాడి చేసిన అధికారులు ఆర్డీఓను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆర్డీఓ రామచందర్ నాయక్‌కు చెందిన జిల్లా కేంద్రంలోని బాబా కాలనీలో ఉన్న ఆయన నివాసంతో పాటు, కార్యాలయంలో కూడా ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో కలకలం రేపింది. లంచం తీసుకున్న వివరాలు మరియు పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# మరికల్‌లో కరాటే శిక్షణ కేంద్రం

## హాజరైన జిల్లా నేతలు



**నేటి సాక్షి,మరికల్ (ఇమామ్ సాబ్):** విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మరక్షణను పెంపొందించే లక్ష్యంతో మరికల్ మండల కేంద్రంలో 'కేఎస్ఎఫ్ (KSF) ఆల్ ఇండియా కరాటే స్కూల్'ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, కరాటే మాస్టర్లు పాల్గొని శిక్షణార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. కరాటే స్కూల్ ఏర్పాటుకు నిరంతర సహకారం అందించిన కేఎస్ఎఫ్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ గణేష్ గడియారం, తెలంగాణ ప్రధాన కార్యదర్శి సెన్సై ఎండీ. తాజుద్దీన్, మార్గనిర్దేశనం చేసిన సెన్సై గౌని శ్రీనివాస్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. సూర్య మోహన్, సర్పంచ్ గుపా చెన్నయ్య, డిప్యూటీ సర్పంచ్ ఖాజా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్గొండి వీరన్న, టౌన్ అధ్యక్షుడు హరీష్, సీనియర్ నాయకులు రామ్ గౌడ్, ఓబీసీ మండల అధ్యక్షుడు సత్యన్న, బీజేపీ మండల అధ్యక్షుడు వేణు, సర్పంచ్ గోపీ, వార్డు సభ్యులు అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు.

# హనుమాన్ పల్లిలో ధాన్యం సేకరణ షురూ



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని హనుమాన్ పల్లి గ్రామంలో మంగళవారం సింగల్ విందు ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను, సింగల్ విండో చైర్మన్ వెంకటరామరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరహరి,అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధన్వాడ సింగల్ విండో సీఈవో వెంకట రాములు, మాజీ చైర్మన్ నిరంజన్ రెడ్డి కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఉర్దూ పాఠశాల అంగన్వాడీ నూతన వంటగది ప్రారంభం

**నేటి సాక్షి, కథలాపూర్:** కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో మంగళవారం రోజున ఉర్దూ ప్రాథమిక పాఠశాల.. అంగన్వాడీ కేంద్రానికి నూతనంగా నిర్మించిన వంటగదిని గ్రామ సర్పంచ్ ముదాం రవి ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ఈ వంటగది నిర్మాణం చేపట్టారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బిజెపి నాయకులు వికాస్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మూదాం రవి, ఉపసర్పంచ్ చిట్యాకి మల్లయ్య, బీజేపీ మండల అధ్యక్షులు మల్యాల మారుతి, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరావు, గాంధారి శ్రీనివాస్, కాసోజి ప్రతాప్, ఎండి హఫీజోద్దీన్, అల్గొట్ ప్రమోద్, సిరిమల్లె రాజశేఖర్, నాంపల్లి లింబాద్రి, వీరమల్ల శ్రీనివాస్, మల్యాల శ్రీకర్, జంబర్తి నర్సింగం, తోపారపు నర్సయ్య, ముంజ వీరేందర్, గాంధారి నరేష్, ఎల్ల వినోద్, కాసోజీ ప్రశాంత్, ద్యావల్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# కోరుట్లలో గడి బురుజుల పరిరక్షణపై బీజేపీ ఆందోళన




**నేటి సాక్షి, కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని చారిత్రక గడి బురుజులు, గ్రామ కంఠ (ఆబాది) భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు మంగళవారం మున్సిపల్ సమావేశానికి ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్రమంగా భూములను కేటాయించి హౌస్ నంబర్లు జారీ చేసిన వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న సుమారు 5000 గజాల భూమికి అనుమతులు లేకుండా 1-1-63 హౌస్ నంబర్ కేటాయించారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ అక్రమ వ్యవహారంలో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పాత్ర ఉందని ఆరోపిస్తూ, వెంటనే వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అధికారులు, అధికార పార్టీ నాయకులు స్పందించకపోవడం దురదృష్టకరమని బీజేపీ నాయకులు విమర్శించారు. తప్పుడు పత్రాలు జారీ చేసిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే మున్సిపల్ ముట్టడి సహా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అన్యాక్రాంతమైన భూములపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షులు, 11వ వార్డు కౌన్సిలర్ కస్తూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు తిరుమల వాసు, రుద్ర సుజాత, కళాల రాధా, సాయి చందు, సొరుపాక రమేష్, రమాదేవి, గుగ్లవత్ శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, ఎర్ర రాజేందర్, మాజీ కౌన్సిలర్లు మాడవేణి నరేష్, పెండం గణేష్, తులసి కృష్ణ, ఉపాధ్యక్షులు మ్యాకల గణేష్, గుద్దేటి రాజేందర్, ఉరుమడ్ల బ్రహ్మం, రాష్ట్ర ఎస్సీ మోర్చా సభ్యులు, యువ మోర్చా నాయకులు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో చలివేంద్రాలు ప్రారంభం





- ఉచిత పెరుగన్నం పంపిణీ
- బిఎల్ఆర్ సేవా కార్యక్రమాలు అభినందనీయం: జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**నేటి సాక్షి,మిర్యాలగూడ :** పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్), బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు ఎంతో ఆదర్శనీయమని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ కొనియాడారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని 7 ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణలతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా బాటసారులకు చల్లని తాగునీరు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో బిఎల్ఆర్ ఆధ్వర్యంలో గత 9 రోజులుగా కొనసాగుతున్న ఉచిత పెరుగన్నం పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రతిరోజూ 3 వేల మందికి భోజనం అందించడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కూడా ప్రజలు, నాయకులతో కలిసి పెరుగన్నం తిని ఆహార నాణ్యతను మెచ్చుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలు, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా పట్టణంలోని ముఖ్య కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. సామాజిక బాధ్యతతో ఎమ్మెల్యే బిఎల్ఆర్ చేస్తున్న ఈ కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం తరపున అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, బిఎల్ఆర్ బ్రదర్స్ సభ్యులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోయకొండ గంగమ్మను దర్శించుకున్న గురువారెడ్డి

- ముఖ్యమంత్రి చంద్రబాబు నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని అమ్మవారికి ప్రార్థన



**నేటి సాక్షి,చౌడేపల్లి :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి మంగళవారం సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఈవో (ఉప కమిషనర్) ఏకాంబరం సాదరంగా స్వాగతం పలికారు. గురువారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు శేష వస్త్రాలను అందజేసి గౌరవించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, ఆయన కుటుంబం ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది, చౌడేపల్లి లైబ్రేరియన్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

**నేటి సాక్షి, చౌడేపల్లి :** ప్రకృతి వ్యవసాయ పద్ధతులను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రైతులు స్థిరమైన, లాభదాయకమైన వ్యవసాయాన్ని సాధించవచ్చని వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ తెలిపారు బుధవారం కాగ తి రైతు సేవా కేంద్రంలో ఎఫ్ఎంటీ, ఐసిఆర్పీలు, టీ -ఐ సి ఆర్ పి లకు మరియు చౌడేపల్లి మండలంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందికి సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ముఖ్యమైన పద్ధతులైన ప్రీ మ్యాన్సూన్ డ్రై సోయింగ్ (పిఎండిఎస్), 365 రోజుల గ్రీన్ కవర్, డ్రౌట్ ప్రూఫింగ్ మోడల్ ( డి ఆర్ పి ఎం) హాఫ్ మూన్ మోడల్ పై సవివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పిఎండిఎస్ పద్ధతి ద్వారా పంటలు ముందుగానే స్థిరపడటంతో దిగుబడులు మెరుగుపడతాయని, 365 రోజుల గ్రీన్ కవర్ ద్వారా భూసారం పెరిగి నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు మరియు డ్రౌట్ ప్రూఫింగ్ మోడల్ వర్షాభావ పరిస్థితుల్లో నేలలో తేమను ఎక్కువ కాలం నిలువ ఉంచి పంటలను ఎండ నుండి రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తక్కువ నీటితో కూడా పంటల సాగు సాధ్యమవుతుందని, భూసారం కాపాడడంతో పాటు పంటలు దిగుబడిని స్థిరంగా ఉంచడంలో ఈ పద్ధతి ఉపయోగకరమై చెప్పారు అలాగే హాఫ్ మూన్ మోడల్ ద్వారా వర్షపు నీటిని సమర్థవంతంగా సేకరించి నేలలోకి చొరబాటును పెంచడం ద్వారా మొక్కల వేర్లకు తగిన తేమ అందించి తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో పంటల పెరుగుదలను మెరుగుపరచవచ్చని వివరించారు.



# ప్రమోషన్లతో కూడిన బదిలీలు చేపట్టాలి

PRTU TS జిల్లా అధ్యక్షులు అయిలేని కరుణాకర్ రెడ్డి



**నేటి సాక్షి కరీంనగర్:** జమ్మికుంట మండల శాఖ అధ్యక్షులు పంజాల కృష్ణమూర్తి అధ్యక్షతన జమ్మికుంట మండల కార్యవర్గ సమావేశం నిర్వహించనైనది కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయిలేని కరుణాకర్ రెడ్డి,మర్రి జైపాల్ రెడ్డి లు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమోషన్లతో కూడిన బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్ లో ఉన్న ఐ.ా లు వెంటనే విడుదల చేయాలని , మెరుగైన పిఆర్సి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెన్సెస్ 2027 శిక్షణ తరగతులను ఉదయం 8 గంటల నుండి ఒంటిగంట వరకు నిర్వహించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు మండల కార్యవర్గ సమావేశంలో జమ్మికుంట మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా ప్రాథమికోన్నత పాఠశాల మాచినపల్లి లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చంద్రగిరి ప్రవీణ్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పాకాల ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తిప్పని వెంకట్రాజం, రాజేంద్ర కుమార్, ఇల్లందకుంట మండల శాఖ అధ్యక్షులు జయప్రకాష్ మండల శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి మ్యాకల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ధన్వాడలో ఎస్సీ హాస్టలను పరిశీలించిన కలెక్టర్



**నేటి సాక్షి,నారాయణపేట,(ఇమామ్ సాబ్):** చదువుతోనే ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమం 99 రోజుల కార్యక్రమం ధన్వాడ మండల కేంద్రంలో సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఎస్సీ హాస్టల్లో జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని అడిగారు 149 మంది విద్యార్థులు ఉన్నారని హాస్టల్ వార్డెన్ కలెక్టర్కు వివరించారు. హాస్టల్లో మరుగుదొడ్లు వంటగది సెప్టిక్ ట్యాంక్ నీటి సరఫరా తదితర వాటిని కలెక్టర్ పరిశీలించారు. వాటర్ ట్యాంక్ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ పరిసరాలలో పిచ్చి మొక్కలు ఇతర వ్యర్థ పదార్థాలు ఉంటే తొలగించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టల్ పురాతనంగా ఉన్న మరమ్మతులు చేయించి మరింత అందంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అందుకు కావాల్సిన ఎస్టిమేట్ వేయాలని అధికారుల ను ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు వస్తున్నాయి అని అడిగారు. డార్మిటరి రూమ్ చూసి పలు సూచనలు చేసినారు.లక్ష్మణ్ అనే విద్యార్థిని నీవు బాగా చదివి ఏం అవుతావు అని ప్రశ్నించగా అడ్వకేట్ అవుతానని విద్యార్థి బదులిచ్చాడు. అంబేద్కర్ క్విజ్ లో పాల్గొన్న విద్యార్థులకు 1 st ప్రైజ్ దేవలింగేశ్వర్, 2nd ప్రైజ్ లక్షన్ నీ డిక్షనరీ ఇవ్వడం జరిగింది. ఈ. డి. ఎస్.సి.కార్పొరేషన్ అబ్దుల్ ఖలీల్ తహసీల్దార్, ఎంపీ. డి. ఓ. పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# కథలాపూర్ మండలంలో అభివృద్ధి పనులపై సమీక్ష



**నేటి సాక్షి, కథలాపూర్:** కథలాపూర్ మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పనుల నుంచి తాగునీటి సరఫరా వరకు పలు అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల ఎస్పీని కలిసిన బీజేపీ నేతలు



**నేటి సాక్షి, కోరుట్ల:** జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ని భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై. అనూప్ రావులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను వారు అభినందించారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని అన్నదానం

**జనసేన నేత కోలా సోమశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**





**నేటి సాక్షి, చౌడేపల్లి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేనాని కొణిదెల పవన్ కళ్యాణ్ ఆరోగ్యం సంపూర్ణంగా కుదుటపడాలని ఆకాంక్షిస్తూ పుంగనూరు నియోజకవర్గ జనసేన నాయకులు కోలా సోమశేఖర్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని బెంగళూరులో ఉన్న విభిన్న ప్రతిభావంతుల ఆశ్రమంలో తన కుటుంబ సమేతంగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు పవన్ కళ్యాణ్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించిన కోలా సోమశేఖర్ మాట్లాడుతూ "నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పరితపించే నాయకుడు పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమన్నారు ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, ప్రజాసేవలో నిమగ్నం కావాలని కోరుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టాం అని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న శాఖలు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఆయన కొనియాడారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, వినూత్న పాలనతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని సోమశేఖర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కోలా సోమశేఖర్ దంపతులతో పాటు స్థానికులు పాల్గొన్నారు

# మైనర్ బాలిక పై అత్యాచారం

**వ్యక్తి అరెస్ట్ రిమాండ్ తరలించిన పోలీస్ లు**




**నేటి సాక్షి,మంచిర్యాల, చెన్నూర్:** 15 సంవత్సరాల మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని వెంటబడి నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడటమే గాక మైనర్ బాలికను వివాహం చేసుకొని ఆమెను మానసికంగా శారీరకంగా వేధించి ఇంటి నుండి గెంటవేసిన కిష్టంపేట కు చెందిన స్వామి అనే యువకుడి పై పోక్సో చట్టం కింద కేసు నమోదు ఆరెస్ట్ చేసి రిమాండుకు తరలించిన చెన్నూర్ పట్టణ సీఐ.బన్సీ లాల్ గత సంవంత్సరం అక్టోబర్ నెలలో కిష్టంపేట కు చెందిన స్వామి అనే యువకుడు అదే గ్రామానికి చెందిన 15 సంవత్సరాల మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి పెళ్లిచేసుకుంటానని నమ్మించి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడి తరువాత మైనర్ అమ్మాయిని ఆమె కుటుంభికుల నిర్ణయానికి వ్యతిరేకంగా వివాహం చేసుకొని ఇంటికి తీసుకొనివెళ్లి ఆమెను కొద్ది కాలానికే మానసికంగా శారీరకంగా వేధింపులకు గురిచేసి ఇంటి నుండి గెంటివేయడమే గాక గత 6 నెలలుగా ఆమెను స్వామి మరల లైంగిక వేధింపులకు గురిచేయడంతో మైనర్ బాలిక తన తల్లితండ్రుల సహాయంతో చెన్నూర్ పట్టణ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు వెంటనే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు అనంతరం మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన మరియు వివాహం చేసుకుని వేధింపులకు గురిచేసిన స్వామి అనే యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్ మైనర్ బాలికలను ఎవరైనా ప్రేమ పెళ్లి పేరిట వెంటబడిన వారిని లైంగికంగా వేధింపులకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే గాక రౌడీ షీట్ కూడా తెరుస్తామని చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్ హెచ్చరించారు.

# నిమ్మ రాజీవ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**అభిమానులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ యువ నేత**



**నేటి సాక్షి,చేర్యాల :** సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు నిమ్మ రాజీవ్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అభిమానుల కోలాహలం మధ్య రాజీవ్ రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్ రెడ్డి ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో నాలుగో వార్డు కౌన్సిలర్ నిమ్మ సుప్రజ రాజీవ్ రెడ్డి, నాయకులు అంకం నవీన్ కుమార్, శ్రీకాంత్ తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో 'చెత్త' రాజకీయం

- పేరుకుపోయిన కుప్పలతో ప్రజల బేజారు!
- వారానికోసారే సేకరణ..

**గాడితప్పిన వ్యవస్థ.. రోగాల భయంలో పట్టణవాసులు**





**నేటి సాక్షి,గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఒకప్పుడు ఆదర్శంగా నిలిచిన ఇంటింటి చెత్త సేకరణ ప్రస్తుతం అట్టడుగు స్థాయికి పడిపోయింది. కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తుండటంతో దుర్వాసన భరించలేక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పట్టణ ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**వారానికోసారి వస్తే ఎట్లా..?**

మున్సిపల్ అధికారులు గతంలో క్రమబద్ధంగా చేపట్టిన సేకరణను ఇప్పుడు వారానికోసారికి పరిమితం చేశారు. దీంతో ఇళ్ల ముందు, అపార్ట్‌మెంట్లలో చెత్త నిల్వలు పెరిగిపోతున్నాయి. కుక్కలు, పందులు ఆ చెత్తను వీధుల నిండా చిందరవందర చేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ముఖ్యంగా మురికివాడలు, బస్తీల్లో పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. దోమల బెడద పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు వస్తాయని చిన్న పిల్లలు, వృద్ధుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**వాహనాలు ఉన్నా.. రోడ్డుపైకి రావు!**

మున్సిపాలిటీ వద్ద 13 ఆటోలు, 12 ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నప్పటికీ, నిర్వహణ లోపం వల్ల సగం కూడా పనిచేయడం లేదు. డీజిల్ ఖర్చులు, రిపేర్లకు నిధులు కేటాయించకపోవడంతో వాహనాలు షెడ్డులకే పరిమితమయ్యాయని సమాచారం. దీనివల్ల పారిశుధ్య సిబ్బంది సైతం నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో తడి-పొడి చెత్తను వేరుచేసి రీసైక్లింగ్ ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేదని, ఇప్పుడు ఆ వర్గీకరణ వ్యవస్థను గాలికి వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రైవేట్ ఏజెన్సీల హస్తం.. మున్సిపాలిటీకి ఆదాయ గండం?**

పట్టణంలో చెత్త సేకరణను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జోరందుకుంది. అదే జరిగితే రీసైక్లింగ్ ద్వారా వచ్చే ఆదాయం, కంపోస్ట్ ఎరువుల అమ్మకాల ద్వారా వచ్చే సొమ్ము పూర్తిగా ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మున్సిపాలిటీ తన సొంత ఆదాయాన్ని కోల్పోవడమే కాకుండా, ప్రజలపై భారం పడే అవకాశం ఉందని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

**తక్షణమే స్పందించాలి..**

అధికారులు వెంటనే స్పందించి మొరాయిస్తున్న వాహనాలను రిపేర్ చేయించాలని, కనీసం రెండు రోజులకోసారి చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలని గజ్వేల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేట్ ఏజెన్సీల జోక్యం లేకుండా మున్సిపాలిటీయే స్వయంగా పారిశుధ్య బాధ్యతలు చేపట్టి పట్టణాన్ని 'స్వచ్ఛ గజ్వేల్'గా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.


# జగిత్యాలలో 'జ్యోతి' వార్షికోత్సవ సంబరాలు





- అలరించిన విద్యార్థుల కళా ప్రదర్శనలు
- ఆత్మవిశ్వాసంతోనే అసాధ్యం సుసాధ్యం
- పాఠశాల డైరెక్టర్ బియ్యల హరి చరణ్ రావు

**నేటి సాక్షి,జగిత్యాల (పూరెళ్ల బాపు):** జగిత్యాల పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీ వార్షికోత్సవ వేడుకలు 'ఆవిష్కార్-2026' మంగళవారం రాత్రి అంబరాన్నంటాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, మేధో వికాస ప్రతిభతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమాన్ని సిద్ధార్థ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫౌండర్ శ్రీమతి మంజుల రమాదేవి, పాఠశాల డైరెక్టర్లు బియ్యల హరి చరణ్ రావు, జిల్లా ట్రస్మా అధ్యక్షుడు బోయినపల్లి శ్రీధర్ రావు, గ్యాన్ డైరెక్టర్ మౌనిక హరిచరణ్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో విజయం సాధించాలంటే ఆత్మవిశ్వాసం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. "నేను చేయగలను" అనే నమ్మకం ఉంటే అసాధ్యమైనది కూడా సాధ్యమవుతుందని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నూతన టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని, సెల్‌ఫోన్లకు, ఇతర వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత ఆశయాల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా సీతారాముల కల్యాణం నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. కాళీమాత, నరసింహ అవతారం, మహాభారతం వంటి పౌరాణిక నాటికలు.. దేశభక్తిని చాటే 'ఆపరేషన్ సింధూర్' ఆర్మీ సాంగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ పండుగల ప్రాముఖ్యత, పల్లె వాతావరణం, క్రికెట్ థీమ్, పర్యావరణ పరిరక్షణ మరియు 'డ్రగ్స్ రహిత సమాజం'పై చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. ఈ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్లు బియ్యాల హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, జే. హరి చరణ్ రావు, మంజుల రమాదేవి, మౌనిక రావు, రజిత, అజిత, సుమన్ రావు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




- వీధి దీపాల్లేక బిక్కుబిక్కుమంటున్న జనం.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్పు

**నేటి సాక్షి,కోరుట్ల:** కోరుట్ల మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. పట్టణంలోని చారిత్రక ప్రాంతమైన గడి బురుజు ప్రస్తుతం చిమ్మ చీకటిలో మగ్గుతోంది. సాయంత్రం ఆరు దాటితే చాలు, ఈ ప్రాంతం బిక్కుబిక్కుమంటూ భయం గుప్పిట్లోకి వెళ్తోంది. వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానిక ప్రజలు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే గడి బురుజు ప్రాంతం అక్రమార్కులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వీధి దీపాలు కూడా లేకపోవడంతో మందుబాబులకు, జూదరులకు ఇది 'సేఫ్ జోన్'గా మారింది. చీకటిని ఆసరాగా చేసుకొని అసాంఘిక శక్తులు ఇక్కడ రెచ్చిపోతున్నాయని, రాత్రి వేళల్లో అటువైపు వెళ్లాలంటేనే సామాన్యులు హడలిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులకు, పాలకవర్గానికి పట్టణ అభివృద్ధి కంటే 'కమీషన్ల' మీద ఉన్న ధ్యాస, కనీస మౌలిక వసతుల కల్పనపై లేదని పట్టణవాసులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కొత్త పనుల మంజూరు, కాంట్రాక్టులపై చూపే ఉత్సాహం.. ఉన్న వీధి దీపాలను బాగు చేయడంలో ఎందుకు చూపడం లేదని ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు స్పందిస్తారా? లేక ముందే మేల్కొని వీధి దీపాలను ఏర్పాటు చేస్తారా? అని జనం నిలదీస్తున్నారు. ఇప్పటికైనా కోరుట్ల మున్సిపల్ 'సార్ల' గాఢ నిద్ర వదిలి, గడి బురుజు ప్రాంతంలో వెలుగులు నింపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# కేసీఆర్ క్యాంపు కార్యాలయం ఎదుట 'కుల రాజకీయం'





**నేటి సాక్షి గజ్వేల్ :** మాజీ సీఎం కేసీఆర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ కాలనీలో విచిత్ర ఘటన చోటుచేసుకుంది. కాలనీలో నివసిస్తున్న కొందరు స్థానికులు మున్సిపల్ అనుమతులు లేకుండానే తమకు నచ్చిన విధంగా, తమ కులానికి అనుగుణంగా కాలనీకి పేర్లు పెట్టుకుని బోర్డులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కాలనీలో మొత్తం 26 ఇళ్లు ఉండగా, కొందరు వ్యక్తులు తమ కుల ప్రాభవం చూపించేలా మూడు ఇళ్ల చొప్పున ప్రత్యేక పేర్లతో కాలనీకి బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఈ కాలనీ పేరు మున్సిపాలిటీ రికార్డుల్లో ఎలాంటి అధికారిక నమోదు లేకపోవడంతో, చిరునామా విషయంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంధువులు, అతిథులకు

- **కేసీఆర్ క్యాంపు కార్యాలయం ఎదుట కాలనీలో కులపేర్లతో బోర్డులు..**
- **మున్సిపల్ అధికారులు తొలగింపు**

చిరునామా చెప్పడంలో కూడా గందరగోళం నెలకొంది. ఈ ఘటనకు ఏడాది కాలం గడిచినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో, స్థానికులు తమకు నచ్చినట్లుగా బోర్డులు పెట్టి కాలనీకి పేర్లు కొనసాగించేందుకు ప్రయత్నించారు. విషయం మున్సిపల్ అధికారుల దృష్టికి చేరడంతో, అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్డులను అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ శాఖ అధికారులు మాట్లాడుతూ, కాలనీకి పేరు పెట్టాలంటే ముందుగా చట్టపరంగా మున్సిపల్ కార్యాలయంలో పూర్తి వివరాలు సమర్పించి అధికారిక అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా ఇలాంటి పేర్లతో బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా స్థానికులు సహకరించాలని అధికారులు కోరారు. కాలనీలో కులపేర్లతో బోర్డులు పెట్టడం సామాజికంగా తప్పుదోవ పట్టించే చర్యగా పలువురు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ అనుమతులు తీసుకుని, అందరికీ ఆమోదయోగ్యమైన పేరును అధికారికంగా నమోదు చేయాలని స్థానికంగా డిమాండ్ వినిపిస్తోంది.

# గడిబురుజుల పరిరక్షణ కోసం అఖిలపక్ష నిరసన దీక్ష



**నేటి సాక్షి, కోరుట్ల:** కోరుట్ల పాత మున్సిపల్ కార్యాలయం వద్ద అఖిలపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గడిబురుజుల (గ్రామకంఠ/ఆబాది) ఖాళీ స్థలాల పరిరక్షణ కోసం మంగళవాం నిరసన దీక్ష ప్రారంభమైంది. కోరుట్లలోని చారిత్రాత్మక గడిబురుజుల ఖాళీ స్థలాలపై జరుగుతున్న అక్రమాలపై అఖిలపక్ష ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టి, అవినీతికి పాల్పడిన రియల్టర్లు, మున్సిపల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గడిబురుజుల చారిత్రాత్మక ప్రాధాన్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు.

చారిత్రక కట్టడాల పరిరక్షణకు డిమాండ్

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గడిబురుజులు కోరుట్లకు గుర్తింపుగా నిలిచే వారసత్వ సంపద అని తెలిపారు. కోనేరును సంరక్షించడంతో పాటు, మైసమ్మ తల్లికి పూర్తి స్థాయి దేవాలయం నిర్మించాలని కోరారు. అలాగే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆ ప్రాంతంలో కూరగాయల మార్కెట్, పార్క్ ఏర్పాటు చేయాలని, ప్రతి సంవత్సరం జరిగే మహిషాసుర మర్దిని ఉత్సవాలకు సంబంధించిన స్థలాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

వివెల్టీలు వెంటనే రద్దు చేయాలి

గడిబురుజుల ఖాళీ స్థలాలకు జారీ చేసిన వివెల్టీలను వెంటనే రద్దు చేయాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. భూ అక్రమ దందాలను అరికట్టాలని, ప్రజా ఆస్తులను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటం పూర్తిగా ప్రజల హక్కుల కోసం కొనసాగుతుందని, డిమాండ్లు నెరవేరే వరకు నిరసనలు ఆగవని హెచ్చరించారు.

అఖిలపక్ష మద్దతు – ఐక్యంగా ముందుకు రావాలి

ఈ నిరసనకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. అనూప్ రావు, ఒబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, జిల్లా నాయకులు సుడవేని మహేష్ మద్దతు తెలిపారు. గడిబురుజుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ మొహమ్మద్ ముజాహిద్ మాట్లాడుతూ, ఈ ఉద్యమం ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని, ఇది పూర్తిగా ప్రజల హక్కుల కోసం జరుగుతోందని స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు కలిసి ఈ సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్న విశ్వనాథ్, డా. పేట భాస్కర్, తుమ్మనపల్లి శ్రీనివాస్ బాబు, సుతారి రాములు, సయ్యద్ అన్వర్, ఎం.ఏ. ముజిబ్ రహ్మాన్, చింతా భూమేశ్వర్, షాహేద్ మహ్మద్ షేక్, పోతాని సత్యం, ఎన్. గంగాధర్, జక్కుల శంకర్, గణేష్, ఎం. రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్‌లో కో ఆప్షన్ సభ్యుల ఎంపిక









**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పురపాలక సంఘంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నలుగురు కో–ఆప్షన్ సభ్యులను ఎన్నుకొని, అభివృద్ధి కార్యక్రమాలపై పలు నిర్ణయాలు తీసుకున్నారు.

- **నలుగురు సభ్యుల ఎంపికకు ప్రత్యేక సమావేశంలో ఆమోదం**
- **కోరుట్ల పట్టణ అభివృద్ధిపై కీలక తీర్మానాలు**

## తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్

ROC.No.898062/2026/F1, తేదీ 28-02-2026.. GO.MS.No.57, 58 (M.A.U.D Dept.) మార్గదర్శకాల మేరకు, కోరుట్ల పురపాలక సంఘంలో 21-04-2026 న ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుండోజి శ్రీనివాస్, సంగ మాలతి,బొద్దూరి సతీష్ కుమార్, అస్మా శాఇస్తాలను నలుగురు కో–ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు. అలాగే పట్టణ అభివృద్ధికి సంబంధించి పలు కీలక తీర్మానాలు ఆమోదించారు.

## శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం -అభినందనల వెల్లువ

కోరుట్ల పట్టణ అభివృద్ధిలో భాగంగా చురుకైన పాత్ర పోషిస్తున్న 27వ వార్డు మాజీ కౌన్సిలర్ గుండోజి శ్రీనివాస్ కో–ఆప్షన్ సభ్యుడిగా ఎంపికై, మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో కౌన్సిలర్‌గా ప్రజలకు అందించిన సేవలను గుర్తించి ఈ పదవి ఇవ్వడం పట్ల ప్రజలు, పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు

## ప్రజాసేవే లక్ష్యం. శ్రీనివాస్

ఈ సందర్భంగా గుండోజి శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కో–ఆప్షన్ సభ్యుడిగా కోరుట్ల పట్టణ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీ సమావేశం



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పోలీస్ కో–ఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారి అధ్యక్షతన ఈ రోజు నిర్వహించబడింది. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో సొసైటీ సాధించిన పురోగతిని, సిబ్బందికి అందించిన రుణ సదుపాయాలను ఇతర సంక్షేమ ఫలాలను కార్యనిర్వాహక సభ్యులు ఎస్పీ గారికి వివరించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. అహర్నిశలు శాంతిభద్రతల పరిరక్షణలో శ్రమిస్తున్న పోలీస్ సిబ్బంది వారి కుటుంబాల సంక్షేమం కోసం జిల్లా పోలీస్ కో–ఆపరేటివ్ సొసైటీ ఆర్థిక సహాయంగా నిలుస్తుందని కొనియాడారు. సిబ్బంది పిల్లల చదువుల కోసం మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేయడం, అత్యవసర పరిస్థితుల్లో సభ్యులకు తక్షణ (E.press) రుణాలు మంజూరు చేయడం, విధి నిర్వహణలో అకాల మరణం సంభవించినప్పుడు బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక భరోసా కల్పించడం వంటి కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే పదవీ విరమణ పొందిన సభ్యులకు గౌరవప్రదంగా ఆర్థిక బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. కార్యనిర్వాహక సభ్యులు ఎప్పటికప్పుడు సమావేశమై సరైన ప్రణాళికలు రూపొందించాలని ఎస్పీ ఆదేశించారు. పారదర్శకమైన పాలనతో క్రింది స్థాయి నుండి ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరికీ సమన్యాయం జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సిబ్బందికి అండగా నిలవడమే సొసైటీ ముఖ్య ఉద్దేశమని ఎస్పీ తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీ బి. రాములు నాయక్, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐ నాగరాజు, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి. అశోక్, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సొసైటీ డైరెక్టర్లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చెన్నూర్‌లో పోలీసుల 'స్పీడ్'

### 24 గంటల్లోనే దొంగ అరెస్ట్.. లక్ష రికవరీ



**నేటి సాక్షి,చెన్నూర్ :** మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణ పోలీసులు తమ పనితీరుతో ప్రజల మన్ననలు పొందుతున్నారు. బస్సు ఎక్కే క్రమంలో జరిగిన భారీ దొంగతనంపై మెరుపు వేగంతో స్పందించి, కేవలం 24 గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకుని లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లికి చెందిన పెద్ది వెంకటేష్ అనే వ్యక్తి నిన్న మహారాష్ట్రలోని ఆసరెల్లిలో ఉన్న తన భూమి కౌలు డబ్బు లక్ష రూపాయలను తీసుకుని తిరిగి వస్తున్నారు. చెన్నూర్ బస్టాండ్‌లో మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో పెద్దపల్లి వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా, ఎవరో గుర్తు తెలియని వ్యక్తి అతని జేబులో ఉన్న లక్ష రూపాయలను కొట్టేశాడు. బాధితుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్ తన సిబ్బంది సాయి ప్రశాంత్, ఖదీర్, సురేష్‌లతో కలిసి వెంటనే బస్టాండ్‌కు చేరుకున్నారు. బాధితుడి వద్ద నుండి అక్కడికక్కడే ఫిర్యాదు స్వీకరించి, చరిత్రలో నిలిచేలా 'స్పాట్ ఎఫ్ఐఆర్' నమోదు చేశారు. అనంతరం బస్టాండ్ పరిసరాల్లోని సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించి నిందితుడి కదలికలను పసిగట్టారు. పోలీసుల నిఘాలో మందమర్రికి చెందిన డొక్క అంజి అనే వ్యక్తి దొంగతనానికి పాల్పడినట్లు తేలింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని వద్ద నుండి చోరీకి గురైన రూ. లక్షను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు సురేష్, ఖదీర్‌లను సీఐ ప్రత్యేకంగా అభినందించారు. ప్రయాణ సమయాల్లో నగదు, విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీఐ బన్సీలాల్ సూచించారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# మిర్యాలగూడ డీఎస్పీగా తుమ్మ ఆనంద్ రెడ్డి



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** వికారాబాద్ ఇంటలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న తుమ్మ ఆనంద్ రెడ్డి ని, మిర్యాలగూడ డీఎస్పీగా నియమిస్తూ, డీఐజీ బి.శ్రీధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డిఎస్పీ రాజశేఖర్ రాజును సీఐడీ విభాగానికి డిఎస్పీగా బదిలీ చేశారు.